- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

ఆదివారం
22-11-2026

సంపుటి : 01 సంచిక : 238 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 238 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha



కాంగ్రెస్ పాలనలో గ్రామీణాభివృద్ధి

కుదేలు

- కేసీఆర్ హయాంలో పంచాయతీల సగటు వ్యయం రూ.16.59 లక్షలు
- రేవంత్ ప్రభుత్వంలో రూ.6.24 లక్షలకు తగ్గుదల
- ఆర్బీఐ నివేదిక గణాంకాలే ఆధారమన్న కేటీఆర్
- గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని విమర్శ
- ప్రజల పన్నులు, ప్రభుత్వ అప్పుల నిధులు ఏమవుతున్నాయని ప్రశ్న
- నిధులు ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని ఆరోపణ
- గ్రామీణ మౌలిక సదుపాయాలపై ప్రభుత్వ నిర్లక్ష్యమని ధ్వజం
- రాష్ట్రంలో అభివృద్ధి కాదు.. విధ్వంసం జరుగుతోందని వ్యాఖ్య

హైదరాబాద్, నవంబర్ 21(మహాప్రభ)

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గ్రామీణాభివృద్ధి కుంటుపడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గ్రామ పంచాయతీలకు కేటాయించే నిధులు, అభివృద్ధి పనుల కోసం చేసే వ్యయం గణనీయంగా తగ్గిపోయాయని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో గ్రామాలు అభివృద్ధి బాటలో పయనించగా, ప్రస్తుత ప్రభుత్వంలో నిధుల కొరతతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తాము చెబుతున్నది కాదని, ఆర్బీఐ విడుదల చేసిన 'ఫైనాన్సెస్ ఆఫ్ పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూషన్స్' నివేదికలోని గణాంకాలే స్పష్టం చేస్తున్నాయని శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

-మిగతా 3 లో

ఫ్యూచర్ సిటీపై రేవంత్ నజర్!

నిధుల కొరత రాకుండా ముందస్తు కార్యాచరణ



- వచ్చే ఉగాది నాటికి మాస్టర్‌ప్లాన్ ఆవిష్కరణకు సన్నాహాలు
- సింగపూర్ సంస్థకు రూపకల్పన బాధ్యతలు
- 30 వేల ఎకరాల్లో 11 ప్రత్యేక రంగాలకు స్థలాల కేటాయింపు
- మౌలిక సదుపాయాల కోసం రూ.18 వేల కోట్ల అంచనా
- రహదారుల అభివృద్ధికి రూ.5 వేల కోట్లు
- నీరు, వ్యర్థాల నిర్వహణకు రూ.6 వేల కోట్లు
- విద్యుత్ వసతుల కోసం రూ.2,350 కోట్లు

హైదరాబాద్, నవంబర్ 21(మహాప్రభ)

ప్రతిష్టాత్మక భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని వేగవంతం చేయడంతోపాటు, నిధుల కొరత తలెత్తకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందస్తు కార్యాచరణ చేపట్టారు. ఎన్నికల్లోగా ఫ్యూచర్ సిటీని పాక్షికంగానైనా ప్రారంభించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా మాస్టర్‌ప్లాన్ రూపకల్పన, మౌలిక సదుపాయాల కల్పన, నిధుల సమీకరణపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. వచ్చే ఏడాది ఉగాది నాటికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా మాస్టర్‌ప్లాన్‌ను ఆవిష్కరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. హైదరాబాద్‌కు సమీపంలోని మీర్‌ఖాన్‌పేట్--ముచ్చర్ల గ్రామాల మధ్య సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నారు. సుమారు 820 చదరపు కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నారు. భవిష్యత్తులో పెరిగే జనాభా, నివాస ప్రాంతాలు, పారిశ్రామిక అవసరాలు, రవాణా సౌకర్యాలకు అనుగుణంగా భూముల వినియోగాన్ని

-మిగతా 3 లో



03

సవాళ్లు ఎదుర్కోకుండా నేను బతకలేను

- ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీఎం మోదీ కీలక వ్యాఖ్యలు!
- సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోవాలని హితవు
- దేశ ప్రగతిని అడ్డుకునే అతిపెద్ద అవరోధం మనసులోని పరిమితులేనని వ్యాఖ్య
- కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమించి ముందుకు సాగిందని స్పష్టీకరణ
- 50 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారని వెల్లడి
- ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో మాట్లాడిన నరేంద్ర మోదీ



03

పాకిస్థాన్-ఏతో భారత్-ఏ అమీతుమీ

- ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో దాయాదుల సమరం
- నేడు దోహాలో చిరకాల ప్రత్యర్థుల ముఖాముఖి
- గెలుపుతో సెమీఫైనల్ బెర్తుపై భారత్-ఏ గురి
- గత ఎడిషన్ ఓటమికి బదులు తీర్చుకోవాలని పట్టుదల
- తొలి మ్యాచ్‌లో నేపాల్‌పై 306 పరుగుల భారీ విజయం
- అదే జోరు కొనసాగించి అగ్రస్థానంపై తిలక్ వర్మ సేన కన్ను
- యూఏఈపై గెలుపుతో ఆత్మవిశ్వాసంతో పాకిస్థాన్-ఏ

'ఆపరేషన్ సిందూర్' వేళ పాక్‌కు చైనా రహస్య సాయం..

- అమెరికా నివేదికలో బండారం బట్టబయలు!
- భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకే పాక్‌కు చైనా సాయం చేసిందన్న యూఎస్ ప్యానెల్
- ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ యుద్ధ విమానాలకు చైనా సాంకేతిక మద్దతు
- భారత సరిహద్దు మోహరింపుల సమాచారాన్ని పాక్‌కు చేరవేసిన వైనం
- రెండు వైపుల నుంచి ఒకేసారి ముప్పు పొంచి ఉందని కమిషన్ హెచ్చరిక

03



వచ్చే ఎన్నికల్లోనూ గోల్ కొడతాం!

విజయంపై పూర్తి ధీమాతో ఉన్నాం



- ప్రజల్లోకి ఎలా వెళ్లాలో మాకు బాగా తెలుసు
- ఎన్నికల ఆటను పక్కాగా ఆడుతున్నాం
- వ్యూహాలకు పదును పెడుతూ ముందుకు సాగుతున్నాం
- వైఎస్సార్ హయాంలో మాదిరిగా అంకితభావంతో పనిచేసే నాయకులు
- కష్టపడే కార్యకర్తలే పార్టీకి అసలైన బలం
- బీజేపీ ఎన్ని వ్యూహాలు పన్నినా ఎదుర్కొనేందుకు సిద్ధం
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం మాదేనన్న పొంగులేటి

03

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధించి మరోసారి గోల్ కొడతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. ఎన్నికలను ఎదుర్కోవడం, ప్రజల్లోకి వెళ్ల వారి మద్దతు పొందడం తమకు కొత్తేమీ కాదని, ఎన్నికల ఆటను పక్కా వ్యూహాలతో ఆడుతున్నామని చెప్పారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మాదిరిగానే అంకితభావంతో పనిచేసే నాయకులు, పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు తమకు అసలైన బలమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమవుతూ, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలకు పదును పెడుతున్నామని తెలిపారు. బీజేపీ ఎన్ని రాజకీయ ఎత్తుగడలు వేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో వచ్చే ఎన్నికల్లోనూ గెలుపు సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.



03

కశ్మీర్‌లో స్థానిక ఉగ్రవాదులు లేరు!

- 35 ఏళ్ల తర్వాత తొలిసారిగా స్థానిక ఉగ్రవాదుల ఉనికి పూర్తిగా అంతం
- ఎల్ఈటీకి చెందిన చివరి స్థానిక కమాండర్ హతం
- లోయలో మిగిలింది విదేశీ ఉగ్రవాదులే
- దేశ భద్రతలో కీలక మైలురాయిగా అభివర్ణించిన అమిత్ షా
- త్వరలో ఉగ్రవాద రహిత ప్రాంతంగా జమ్ముకశ్మీర్
- అరుణాచల్‌ప్రదేశ్‌లో 900 మందికి పైగా పోలీసులకు నియామక పత్రాలు
- సరిహద్దు రాష్ట్ర భద్రతకు అత్యంత ప్రాధాన్యమన్న కేంద్ర హోంమంత్రి
- స్థానికుడైన లతీఫ్ తక్కువ కాలంలోనే కమాండర్‌గా ఎదుగుదల

శాంతిభద్రతల సాకుతో జర్నలిస్టులను అడ్డుకోరాదు



03



ఎస్సై అభ్యర్థులకు అలర్ట్.. హాల్‌టికెట్లు విడుదల

ఈ నెల 29న ప్రిలిమినరీ రాత పరీక్ష

- నేటి నుంచి 28వ తేదీ వరకు హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి
- హాల్‌టికెట్‌పై పాస్‌పోర్టు సైజు ఫొటో తప్పనిసరి
- దరఖాస్తులో ఉపయోగించిన ఫొటోనే అతికించాలి
- ఫొటో లేకుంటే పరీక్షకు అనుమతి నిరాకరణ
- సాంకేతిక సమస్యలపై ప్రత్యేక సహాయ నంబరు
- టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు ప్రకటన

తెలంగాణ బ్యూరో, ప్రతినిధినవంబర్ 21(మహాప్రభ)

తెలంగాణలో ఎస్సై ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. ఈ నెల 29న నిర్వహించనున్న ఎస్సై ప్రిలిమినరీ రాత పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను ఈ నెల 22వ తేదీ నుంచి అందుబాటులో ఉంచుతున్నట్లు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు..అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 28వ తేదీ వరకు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే ఆకు ఈ-మెయిల్ చేయడం ద్వారా లేదా

-మిగతా 3 లో

బీహార్‌లో 'నితీశ్ సేతు' ప్రారంభం

దేశంలో అత్యంత పొడవైన వంతెన



పాట్నా నవంబర్ 21(మహాప్రభ)
బీహార్‌లోని వైశాలిలో గంగా నదిపై నిర్మించిన 'నితీశ్ సేతు'ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. ఇది మన దేశంలో అత్యంత పొడవైన వంతెన. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, జ్రేడీయూ చీఫ్ నితీశ్ కుమార్‌ను ప్రశంసించారు. ఆయన సుపరిపాలన, సంక్షేమ పథకాల పట్ల ప్రజలకు నమ్మకం ఉందన్నారు. ఈ వంతెన పాట్నాలోని కచ్చి దర్గాను వైశాలి జిల్లాలోని రాఘవ్‌పూర్, బిదుపూర్‌లను కలుపుతుంది. దీనిలోని ప్రధాన భాగం పొడవు 9.76 కి.మీ. గంగా నదికి ఇరువైపుల నిర్మించిన అప్రోచ్ రోడ్లతో కలిపి మొత్తం పొడవు 19.76 కి.మీ. దీంతో ఉత్తర, దక్షిణ బీహార్ జిల్లాల మధ్య ప్రయాణ కాలం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

కల్తీ మద్యం తాగి 13 మంది మృతి

346 మందికి తీవ్ర అస్వస్థత మణిపూర్‌లో ఘటన



ఇంపాల్:నవంబర్ 21(మహాప్రభ)
మణిపూర్‌లోని చాండెల్ జిల్లాలో కల్తీమద్యం తాగి 13 మంది చనిపోగా 346 మంది దవాఖాన పాలయ్యారు. ఈ నెల 18 నుంచి కల్తీమద్యం ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. మద్యంలో ప్రమాదకరమైన మిథనాల్ కలిసినట్టు అనుమానిస్తున్నారు. ముఖ్యమంత్రి యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్ బాధితులను పరామర్శించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బిష్ణుపూర్, సేనాపతి, కక్చింగ్, తౌబాల్ జిల్లాల్లో స్థానికంగా తయారయ్యే మద్యం లేదా ఆధారాలు తెలియని మద్యాన్ని తాగొద్దన్నారు.

చైనా విడిభాగాలతో దేశ భద్రతకు ముప్పు!



న్యూఢిల్లీ నవంబర్ 21(మహాప్రభ)
భారత రక్షణ రంగంలో ఐదేండ్లలో కొనుగోలు చేసిన డ్రోన్లు, వాటి విడిభాగాలలో చైనాకు చెందినవే ఎక్కువ ఉండటంపై డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీఎఫ్ఐ) తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. 2021 మార్చి నుంచి 2026 నవంబర్ 19 వరకు ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ ద్వారా సైన్యం, భద్రతా బలగాలు, ఇతర ప్రభుత్వ సంస్థలు చైనా డ్రోన్లు, వాటి విడిభాగాలను పేర్కొంటూ ఏకంగా 689 టెండర్లు జారీ చేసినట్టు డీఎఫ్ఐ వెల్లడించింది. వీటిలో 580 టెండర్లు (84 శాతం) ఒక్క భారత సైన్యానివే కావడం గమనార్హం. 2026లో ఇప్పటివరకు గుర్తించిన 355 టెండర్లలో 328 టెండర్లు కూడా సైన్యానికి సంబంధించినవే.

బీజేపీలో చేరిన క్రికెటర్ యజ్వేంద్ర చాహల్



న్యూఢిల్లీ నవంబర్ 21(మహాప్రభ)
భారత యువ క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. శనివారం అధికారికంగా బీజేపీలో చేరారు. చాహల్‌ను బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా కార్యవర్గంలో ప్రత్యేక ఆహ్వానితుడిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నియమించారు. బీజేపీలో చేరడానికి ముందు ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అమర్‌పాల్ మౌర్యతో చాహల్ ప్రత్యేకంగా భేటీ అయ్యాడు. చాహల్ రాకతో యువతలో ముఖ్యంగా ఓబీసీలో బీజేపీకి బలం చేకూరుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. చాహల్ ఇండియా తరఫున అనేక మ్యాచ్‌ల్లో ఆడాడు

నీట్ పేపర్ లీక్ కేసులో అభియోగాలు నమోదు

14 మంది నిందితులు విచారణ ఎదుర్కోవాల్సిందే

25 నుంచి ప్రత్యేక కోర్టులో రోజువారీ విచారణ



న్యూఢిల్లీ, నవంబర్ 21(మహాప్రభ)
నీట్-యూజీ2026 పేపర్ లీక్ కేసులో 14 మంది నిందితులు అందరిపై ఢిల్లీ ఫాస్ట్-ట్రాక్ కోర్టు శనివారం అధికారికంగా అభియోగాలను నమోదు చేసింది. నిందితులలో ఎన్‌టీఏ సబ్జెక్ట్ నిపుణులు కూడా ఉన్నారు. నిందితులు అందరూ శనివారం రౌస్ అవెన్యూ కోర్టులో ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా ఎదుట హాజరయ్యారు. తాము నిర్దోషులమని, విచారణను ఎదుర్కొనడానికి తాము సిద్ధంగా ఉన్నామని వారు చెప్పారు. కుట్ర, మోసం, నమ్మకద్రోహం, అవినీతితో సహా పలు అభియోగాలను వారిపై కోర్టు నమోదు చేసింది. ఈనెల 25 నుంచి రోజువారీ విచారణ జరుగుతుంది.

అదానీ డిఫెన్స్ క్షిపణుల పరీక్ష విజయవంతం

భూతల, గగనతల లక్ష్యాలను ఛేదించే సత్తా



న్యూఢిల్లీ నవంబర్ 21(మహాప్రభ)
అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ శుక్రవారం నిర్వహించిన బఖీరా ఏటీ1 ట్యాంక్ విధ్వంసక గైడెడ్ క్షిపణుల పరీక్ష విజయవంతమైంది. ఈ కంపెనీ శనివారం ఇచ్చిన పోస్ట్‌లో తెలిపిన వివరాల ప్రకారం, రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఈ పరీక్షలు రాత్రి , పగలు జరిగాయి. ఇవి వాహనంపై తీసుకెళ్లగలిగే క్షిపణులు. భూతలం నుంచి ప్రయోగించే యాంటీ ట్యాంక్ మిసైల్ సామర్థ్యం దాదాపు 4 కి.మీ. ఉంటుంది, కాగా, బఖీరా ఏటీ1 సామర్థ్యం 8 కి.మీ. వరకు ఉన్నది. ఈ వ్యవస్థ గగనతల లక్ష్యాలను కూడా ఛేదించగలదు.

రాజస్థాన్‌లో బీజేపీకి ఘోర పరాభవం

-స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి భారీ ఎదురుదెబ్బ
-పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో 70% సీట్లలో పరాజయం
-సీఎం, మంత్రుల నియోజక వర్గాల్లో సైతం తప్పని ఓటమి
-మంత్రుల సొంత కుటుంబ సభ్యులకూ తప్పని ఓటమి



న్యూఢిల్లీ, నవంబర్ 21(మహాప్రభ)
స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ గెలుపొందడం సర్వసాధారణం. కానీ రాజస్థాన్‌లో సీన్ రివర్స్ అయింది. అక్కడ అధికారంలో ఉన్న బీజేపీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన మొత్తం 37 జిల్లాల్లో కేవలం ఆరు జిల్లాల్లో మాత్రమే తన ఆధిపత్యాన్ని ప్రదర్శించగలిగింది. మిగిలిన 31 జిల్లాల్లో బీజేపీ చిత్తుగా ఓడిపోయింది. ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ సొంత జిల్లాల్లో సైతం అధికార పార్టీకి ఘోర పరాభవం ఎదురైంది. రాజస్థాన్‌లో శుక్రవారం జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు దాదాపు 70 శాతం పంచాయతీ సీట్లను, రెండింతల జిల్లా పరిషత్ సీట్లను గెలుచుకున్నారు.
సీఎం భజన్‌లాల్‌శర్మ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగవేర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సంగవేర్ పంచాయతీ సమితిలో మొత్తం 15 స్థానాలకు గాను 8 సీట్లను సహనుమాన్ బెనివాల్ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ గెలుచుకుంది. భరత్‌పూర్ జిల్లా పరిషత్‌లోని మొత్తం 31 స్థానాలకు గాను బీజేపీ కేవలం 9 స్థానాలను గెలుచుకుంది. మరో రెండేండ్లలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాజస్థాన్‌లో గ్రామీణ ఓటర్లు అధికారంలో ఉన్న బీజేపీని చావుదెబ్బ తీశారు. ఆ పార్టీ కీలక నాయకుల ప్రభావం ఉన్న ప్రాంతాల్లో సైతం ఓటమిని చవిచూడటంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని తిరిగి బలోపేతం చేసుకోవలసిన బాధ్యత అధికారపక్షంపై పడింది. రాష్ట్రంలోని మొత్తం 41 జిల్లాల్లో 37 జిల్లా పరిషత్‌లకు మాత్రమే ఫలితాలు వచ్చాయి. ఇందులో కేవలం ఆరు చోట్ల మాత్రమే బీజేపీ మెజారిటీని దక్కించుకుంది. మిగిలిన నాలుగు జిల్లాల్లో ఓట్ల లెక్కింపు వచ్చే నెలలో జరుగనున్నది.
బీజేపీ దిగ్గజాలకు ఎదురుదెబ్బ
రాష్ట్ర మంత్రి జబర్‌సింగ్ ఖ్రా భార్య, ఇద్దరు కుమారులతోసహా నలుగురు కుటుంబ సభ్యులు శ్రీమాదోపూర్ పంచాయతీ సమితి ఎన్నికల్లో ఘోర ఓటమిని చవిచూశారు. క్యాబినెట్ మంత్రులు రాజవర్ధన్ రాథోడ్, జోరారామ్ కుమావత్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ ఓటమి చెందింది. ఆర్ఎల్‌పీకి బలమైన పట్టున్న నాగౌర్‌లో ఆ పార్టీ తన సత్తాను చాటుకుంది. ఈ ఫలితాలు బీజేపీకి తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ ఫలితాలు అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకత్వ పాలనాతీరుపై ప్రజల తీర్పును స్పష్టంగా సూచిస్తున్నాయి.

'పెట్టుబడుల' లీక్‌పై రాజకీయ ప్రకంపనలు

-బిద్దుబాటు చర్యల్లో రెండు రాష్ట్రాలు
-తొలిగించింది ఇద్దరినేనని, మరో13 మంది స్వచ్ఛందంగా వెళ్లారని ప్రకటన



చెన్నై/అమరావతినవంబర్ 21(మహాప్రభ)
: పెట్టుబడులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య నెలకొన్న వివాదం రెండు రాష్ట్రాల్లో రాజకీయ ప్రకంపనలు రేపుతున్నది. తమిళనాడుకు రావాల్సిన పెట్టుబడులను ఏపీ దకించుకొంటున్నదని, ఇందుకోసం గైడెన్స్‌లో పనిచేసిన ఉద్యోగులు గూఢచర్యం చేశారంటూ ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలతో 15 మంది ఉద్యోగులను తొలిగించినట్టు మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. 15మంది గైడెన్స్ సంస్థను వీడటం నిజమే అయినా.. అందులో 13 మంది స్వచ్ఛందంగా రాజీనామా చేశారని, ఇద్దరిని మాత్రమే తొలిగించినట్టు తేలింది. 10 మందికి జాబ్ ఆఫర్ ఇవ్వగా, ముగ్గురు మాత్రమే చేరారని ఏపీ తరఫున వాదనలు వినిపిస్తున్నాయి.
జూనియర్ వికటన్ కథనంతో అజ్యం
తమిళనాడు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 1992లో గైడెన్స్ అనే సంస్థ ఏర్పాటైంది. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతాల గుర్తింపు వంటి బాధ్యతలను ఈ సంస్థ నిర్వహిస్తుంది. విశాఖపట్నంలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సు తాజా వివాదానికి వేదికగా మారింది. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని ప్రభుత్వం ప్రకటించింది. గైడెన్స్‌లో గతంలో పనిచేసిన కొందరు ఉద్యోగులు ఈ సదస్సు నిర్వహణలో భాగస్వాములయ్యారని ఈ నెల 18న తమిళ పత్రిక జూనియర్ వికటన్‌లో ప్రచురితమైన కథనం ఈ వివాదానికి ఆజ్యంపోసింది. గైడెన్స్‌లో కీలక స్థానాల్లో పనిచేసిన ఉద్యోగులు ఇప్పుడు ఏపీతో కలిసి పనిచేస్తున్నారని పేర్కొన్నది. పరిశ్రమల శాఖ మాజీ మంత్రి రాజాకు సన్నిహితులని, టీవీకే ప్రభుత్వం వారిని తొలిగించిందని వెల్లడించింది.

బస్సు ప్రయాణం ప్రాణసంకటమా?

ఐదేండ్లలో 606 అగ్ని ప్రమాదాలు

భద్రతా లోపాలు సరిదిద్దేదెన్నడు?



న్యూఢిల్లీ:నవంబర్ 21(మహాప్రభ)
దేశంలో బస్సు ప్రయాణం రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతున్నదా? వరుస అగ్నిప్రమాదాలు ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. 2021 జనవరి నుంచి 2026 జూన్ వరకు దేశవ్యాప్తంగా మొత్తం 606 బస్సు అగ్ని ప్రమాదాలు నమోదయ్యాయి. ఈ ఘటనల్లో 303 మంది ప్రాణాలు కోల్పోగా, 991 మంది గాయపడ్డారు. ఒక్క 2026 తొలి ఆరు నెలల్లోనే 133 బస్సుల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది.మహారాష్ట్రలో అత్యధికంగా 82, తమిళనాడు, యూపీలో 44 చొప్పున జరిగాయి. రాజస్థాన్ లో 55 మంది చనిపోయారు.ప్రైవేటు బస్సుల్లో జరిగిన 367 ప్రమాదాల్లో 276 మంది మరణించారు. ఇంజిన్, విద్యుత్తు వ్యవస్థల్లో లోపాలు, టైర్లు, బ్రేకుల వైఫల్యాలు ప్రమాదాలకు కారణం. స్లీపర్ బస్సుల్లో అత్యవసర ద్వారాలను తొలగించడం ప్రాణాలకు ముప్పుగా మారుతున్నది.

కాంగ్రెస్ పాలనలో గ్రామీణాభివృద్ధి కుదేలు

(మొదటి తరువాయి)

సగటు వ్యయం భారీగా తగ్గుదల

2022-23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు సగటున రూ.16.59 లక్షలు ఖర్చు చేశాయని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024-25లో ఈ వ్యయం రూ.6.24 లక్షలకు పడిపోయిందని పేర్కొన్నారు. పంచాయతీల సగటు వ్యయం ఇంతలా తగ్గడం గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

నిధులన్నీ ఎటు పోతున్నాయి?

ప్రజలు చెల్లిస్తున్న పన్నులు, ప్రభుత్వం తీసుకొస్తున్న లక్షల కోట్ల రూపాయల అప్పులు ఎటు వెళ్తున్నాయని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు నిధులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఖజానాలోని సొమ్మును అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేయకుండా ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని విమర్శించారు.

గతంలో గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలకు అవసరమైన నిధులు సమకూర్చి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చామని కేటీఆర్ పేర్కొన్నారు. రహదారులు, ఇతర అభివృద్ధి పనుల ద్వారా గ్రామాల రూపురేఖలు మార్చేందుకు చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో మాత్రం గ్రామాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు.

అభివృద్ధి కాదు.. విధ్వంసం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు అందకపోవడంతో పంచాయతీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం గ్రామాల అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్నదంతా అభివృద్ధి కాదని, విధ్వంసమేనని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

సవాళ్లు ఎదుర్కోకుండా నేను బతకలేను..

-ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీఎం మోదీ కీలక వ్యాఖ్యలు!
-సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోవాలని హితవు
-దేశ ప్రగతిని అడ్డుకునే అతిపెద్ద అవరోధం మనసులోని పరిమితులేనని వ్యాఖ్య
-కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమించి ముందుకు సాగిందని స్పష్టీకరణ
-50 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారని వెల్లడి
-ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో మాట్లాడిన నరేంద్ర మోదీ



సవాళ్లను ఎదుర్కోకుండా తాను జీవించలేనని, సంకుచిత భావజాలాన్ని వీడినప్పుడే వ్యక్తులతో పాటు దేశం పురోగమిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోకపోతే అనుకున్న ప్రగతిని ఎప్పటికీ సాధించలేమని యువతకు సూచించారు. దేశ ప్రగతిని అడ్డుకునే అతిపెద్ద అవరోధం మనసులోని పరిమితులేనని, గత కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమించి ఎంతో ముందుకు సాగిందని స్పష్టం చేశారు. ఒకప్పుడు దేశంలో పేదరికాన్ని మార్చలేని శాపంగా భావించే వారని, భారత్ దాని నుంచి ఎప్పటికీ బయటపడలేదన్న అభిప్రాయం ఉండేదని ప్రధాని గుర్తుచేశారు. గతంలో ఎవరూ ఆ సమస్యను పరిష్కరించే సాహసం చేయలేదన్నారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక నిరుపేదల ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చామని చెప్పారు. ఫలితంగా దేశంలో దాదాపు 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చినట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక స్వయంగా ధ్రువీకరించిందని తెలిపారు. గత 75 ఏళ్ల కాలంలో భారత్ ఎడ్లబండ్ల స్థాయి నుంచి బుల్లెట్ రైళ్ల దిశగా వేగంగా ఎదిగిందని, ఈ చారిత్రక మార్పులకు ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రత్యక్ష సాక్షిగా నిలిచిందని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధన రంగంలోనూ సరికొత్త మార్పులు తెచ్చామని మోదీ వివరించారు. గతంలో ఇస్రోలోకి ప్రతిభావంతులైన యువత ప్రవేశంపై అనేక ఆంక్షలు ఉండేవని, వాటిని తొలగించి అర్హులైన యువ నిపుణులకు తలుపులు తెరిచామని వెల్లడించారు. అందుకే నేడు భారత అంతరిక్ష విజయాలను ప్రపంచం మొత్తం గుర్తిస్తోందన్నారు. సెమీకండక్టర్ల రంగంలో ఐదు దశాబ్దాల క్రితం అవకాశాన్ని చేజార్చుకున్నప్పటికీ, తాము పట్టుదలతో నాలుగేళ్లలోనే భారీ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషించనుందని, విద్యార్థులు 'దేశమే ప్రథమం' అనే నినాదంతో సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

పాకిస్థాన్-ఏతో భారత్-ఏ అమీతుమీ



దోహా:

ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. గ్రూప్-బీలో భాగంగా ఆదివారం దోహాలోని వెస్ట్ ఎండ్ పార్క్ స్టేడియంలో భారత్-ఏ, పాకిస్థాన్-ఏ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి గత ఏడాది ఎడిషన్‌లో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకోవడంతో పాటు సెమీఫైనల్ బెర్తును ఖాయం చేసుకోవాలని తిలక్ వర్మ సేన పట్టుదలగా ఉంది. తొలి మ్యాచ్‌లో నేపాల్‌పై భారత్-ఏ ఏకంగా 306 పరుగుల భారీ తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుంది. అదే జోరును పాకిస్థాన్‌పై కూడా కొనసాగించి గ్రూపులో అగ్రస్థానాన్ని దక్కించుకోవాలని భావిస్తోంది. మరోవైపు అబ్దుల్ సమద్ నాయకత్వంలోని పాకిస్థాన్-ఏ జట్టు తొలి మ్యాచ్‌లో యూఏఈపై 61 పరుగుల తేడాతో గెలుపొందింది. దీంతో ఇరు జట్లు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతుండటంతో దాయాదుల పోరు ఆసక్తికరంగా మారనుంది.

ఎస్సై అభ్యర్థులకు అలర్ట్.. హాల్‌టికెట్లు విడుదల

040-41895151 ఫోన్ నంబర్‌ను సంప్రదించి సహాయం పొందవచ్చని వివరించారు.పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌పై తమ పాస్‌పోర్టు సైజు ఫొటోను తప్పనిసరిగా అతికించాలని చైర్మన్ స్పష్టం చేశారు. గతంలో ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఉపయోగించిన ఫొటోనే వాడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫొటో లేకుండా పరీక్ష కేంద్రానికి వచ్చే అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్ష రాసేందుకు అనుమతించబోమని తేల్చి చెప్పారు.

ఫ్యూచర్ సిటీపై రేవంత్ నజర్!

(మొదటి తరువాయి)

నిర్దేశించనున్నారు. ఇందుకోసం పట్టణ ప్రణాళికలో అనుభవం ఉన్న సింగపూర్ సంస్థకు మాస్టర్‌ప్లాన్ రూపకల్పన బాధ్యతలు అప్పగించారు. ఆ సంస్థ ప్రతినిధులు ఇటీవల హైదరాబాద్‌కు వచ్చి ఫ్యూచర్ సిటీ పరిధిలోని గ్రామాలపై అధ్యయనం ప్రారంభించారు. నగర పరిసరాల్లో బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఏర్పాటుకు అనుగుణంగా భూముల వినియోగాన్ని నిర్ణయించనున్నారు. నిర్మాణ అనుమతుల కోసం బిల్ట్ నౌ విధానాన్ని అమలు చేయనున్నారు. పార్కులు, పర్యాటక ప్రాంతాలకు ప్రాధాన్యమివ్వడంతోపాటు భవిష్యత్తులో పెరిగే వాహన రద్దీకి అనుగుణంగా రహదారులను అభివృద్ధి చేయనున్నారు. కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు అనుమతులు ఇచ్చే సమయంలో ఎఫ్‌ఏఆర్ నిబంధనల ప్రకారం భవనాల మధ్య ఖాళీ స్థలాలు, రహదారులు, పార్కులకు తగిన స్థలం ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ఫ్యూచర్ సిటీ మీదుగా వెళ్లే రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు-1కు అనుసంధానంగా అంతర్గత రహదారులను నిర్మించాలని నిర్ణయించారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కందుకూరు, యాచారం, కడ్తాల్, మంచాల, ఆమనగల్లు మండలాల్లోని రహదారులను ఎఫ్‌ఎండీఏ పరిధిలోని రోడ్లతో అనుసంధానించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. నగర భవిష్యత్తు అవసరాలకు సరిపడా తాగునీటిని అందించేందుకు ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణంపైనా అధికారులు దృష్టి సారించారు. ఫ్యూచర్ సిటీలో మొత్తం 11 ప్రత్యేక రంగాలకు స్థలాలు కేటాయించనున్నారు. లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, డేటా కేంద్రాలు, కృత్రిమ మేధస్సు, ఆరోగ్య నగరం, వినోదం, మిశ్రమ వినియోగం, క్రీడా కేంద్రాలు, నివాస ప్రాంతాలు, ఫర్నిచర్ పార్కు, విద్యుత్ వాహనాలు--ఇంధన నిల్వ వ్యవస్థలు, విద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పని, నివాసం, విద్య, వినోదం ఒకే ప్రాంతంలో అందుబాటులో ఉండేలా నగరాన్ని తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. మౌలిక సదుపాయాల కల్పనకు మొత్తం రూ.18 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. ఇందులో రహదారుల నిర్మాణానికి రూ.5 వేల కోట్లు, నీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణకు రూ.6 వేల కోట్లు, విద్యుత్ వసతులకు రూ.2,350 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. యెల్లంపల్లి జలాశయం నుంచి రోజుకు 164 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాలని యోచిస్తున్నారు. నగరం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే సుమారు 15 లక్షల మంది నివసించే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో నిధుల సమస్య తలెత్తకుండా ఒక్కో రంగానికి అవసరమైన వ్యయాన్ని ముందుగానే అంచనా వేసి, దశలవారీగా నిధులు సమకూర్చుకునేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. మాస్టర్‌ప్లాన్ ఆవిష్కరణతోపాటు కీలక మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేసి, ఎన్నికల్లోగా నగరంలోని కొన్ని భాగాలను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.

'ఆపరేషన్ సిందూర్' వేళ పాక్‌కు చైనా రహస్య సాయం..

-అమెరికా నివేదికలో బండారం బట్టబయలు!
-భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకే పాక్‌కు చైనా సాయం చేసిందన్న యూఎస్ ప్యానెల్
-ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ యుద్ధ విమానాలకు చైనా సాంకేతిక మద్దతు
-భారత సరిహద్దు మోహరింపుల సమాచారాన్ని పాక్‌కు చేరవేసిన వైనం
-రెండు వైపుల నుంచి ఒకేసారి ముప్పు పొంచి ఉందని కమిషన్ హెచ్చరిక



భారత్ ఎదుగుదలను అణచివేసే కుట్రలో భాగంగానే 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు చైనా సైనిక సాయం అందించిందని అమెరికా కాంగ్రెస్ కమిషన్ తన తాజా నివేదికలో కుండబద్దలు కొట్టింది. సరిహద్దుల్లో సైనిక ఒత్తిడి పెంచడం, పారిశ్రామిక సరఫరాలపై ఆంక్షలు విధించడం ద్వారా భారత్‌ను కట్టడి చేసేందుకు బీజింగ్ ప్రయత్నిస్తోందని అమెరికా-చైనా ఎకనామిక్ అండ్ సెక్యూరిటీ రివ్యూ కమిషన్ వెల్లడించింది. ఆసియాలో చైనాకు ప్రత్యామ్నాయ శక్తిగా భారత్ ఎదుగుతోందని, దీనిని అడ్డుకునేందుకే చైనా బహుముఖ వ్యూహాలను రచిస్తోందని పేర్కొంది. గత ఏడాది పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య జరిగిన నాలుగు రోజుల ఘర్షణల్లో చైనా నేరుగా యుద్ధంలోకి దిగకుండానే పాకిస్థాన్‌ను బలోపేతం చేసిందని నివేదిక స్పష్టం చేసింది. పాక్ వాయుసేన ఉపయోగించిన జే-10సీఈ యుద్ధ విమానాల పూర్తి స్థాయి వినియోగానికి తమ ఇంజనీర్లు అక్కడే ఉండి సాంకేతిక సహకారం అందించారని చైనా స్వయంగా అంగీకరించిన విషయాన్ని కమిషన్ ప్రస్తావించింది. భారత్ మోహరింపులకు సంబంధించిన సమాచారాన్ని కూడా చైనా ఎప్పటికప్పుడు పాక్‌కు చేరవేసిందని తెలిపింది. భవిష్యత్‌లో రెండు వైపుల నుంచి ఒకేసారి ముప్పు (టూ-ఫ్రంట్ వార్) ఎదురయ్యే ప్రమాదం దీనివల్ల భారత్‌కు మరింత పెరుగుతోందని హెచ్చరించింది. మరోవైపు భారత్‌పై చైనా ఆర్థిక అస్త్రాన్ని కూడా ప్రయోగిస్తోందని నివేదిక స్పష్టం చేసింది. భారత ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని దెబ్బతీసేందుకు ముడిసరకుల ఎగుమతులను ఆపడం, తమ ఇంజనీర్లను వెనక్కి పిలిపించడం వంటి చర్యలకు దిగుతోందని తెలిపింది. భారత ఫార్మా, క్లీన్ ఎనర్జీ రంగాలు పుంజుకోకుండా చైనా తక్కువ ధరల వ్యూహాలను, బ్యాటరీ టెక్నాలజీ ఆంక్షలను అమలు చేస్తోందని విశ్లేషించింది. ఈ వ్యూహాలను దీటుగా ఎదుర్కొనేందుకు భారత్ తన రక్షణ రంగాన్ని ఆధునికీకరిస్తూనే దేశీయ తయారీకి పెద్దపీట వేస్తోందని, అమెరికా కూడా భారత్‌తో నిఘా, సముద్ర భద్రత, తయారీ రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని ఈ కమిషన్ పిలుపునిచ్చింది.

వచ్చే ఎన్నికల్లోనూ గోల్ కొడతాం!

-ప్రజల్లోకి ఎలా వెళ్లాలో మాకు బాగా తెలుసు
-ఎన్నికల ఆటను పక్కాగా ఆడుతున్నాం
-వ్యూహాలకు పదును పెడుతూ ముందుకు సాగుతున్నాం
-వైఎస్సార్ హయాంలో మాదిరిగా అంకితభావంతో పనిచేసే నాయకులు
-కష్టపడే కార్యకర్తలే పార్టీకి అసలైన బలం
-బీజేపీ ఎన్ని వ్యూహాలు పన్నినా ఎదుర్కొనేందుకు సిద్ధం
-వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం మాదేనన్న పొంగులేటి



హైదరాబాద్, నవంబర్ 21

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధించి మరోసారి గోల్ కొడతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలను ఎదుర్కోవడం, ప్రజల్లోకి వెళ్లి వారి మద్దతు పొందడం తమకు కొత్తేమీ కాదని పేర్కొన్నారు. ప్రజలతో ఎలా మమేకం కావాలో, ఎన్నికల సమయంలో ఎలాంటి వ్యూహాలు అనుసరించాలో తమకు పూర్తి అవగాహన ఉందని చెప్పారు. ప్రస్తుతం కూడా ఎన్నికల ప్రక్రియను దృష్టిలో పెట్టుకొని పార్టీ శ్రేణులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నాయని వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు రాజకీయ అంశాలపై మాట్లాడారు.

ఎన్నికలపై స్పష్టమైన వ్యూహం

ఎన్నికల్లో గెలుపు కోసం ప్రజల్లోకి వెళ్లడం, వారి సమస్యలను తెలుసుకోవడం, పార్టీ విధానాలను వివరించడం కీలకమని పొంగులేటి పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు అనుభవం ఉందని, ఎన్నికల ఆటను పక్కాగా ఆడుతున్నామని తెలిపారు. రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను రూపొందించుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ప్రజలతో సంబంధాలను బలోపేతం చేసుకోవడం, పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం ద్వారా ఎన్నికల్లో లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

వైఎస్సార్ హయాం నాటి స్ఫూర్తి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పార్టీలో ఉన్న కష్టపడే తత్వం, అంకితభావం ప్రస్తుతం కూడా కొనసాగుతున్నాయని మంత్రి అన్నారు. అప్పట్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేసేవారని గుర్తుచేశారు. అదే తరహాలో ప్రస్తుతం కూడా బాధ్యతతో పనిచేసే నాయకులు, నిబద్ధత కలిగిన కార్యకర్తలతో బలమైన బృందం ఉందని వివరించారు. పార్టీ కోసం శ్రమించే వారి సహకారంతో రాజకీయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

బీజేపీ వ్యూహాలను ఎదుర్కొంటాం

రాష్ట్రంలో బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ వ్యూహాలపైనా పొంగులేటి స్పందించారు. ఆ పార్టీ ఎన్ని రాజకీయ ఎత్తుగడలు వేసినా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రత్యర్థుల వ్యూహాలకు భయపడే ప్రసక్తి లేదని, తమకు సొంత కార్యాచరణ ఉందని ఆయన వ్యాఖ్యల ద్వారా వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో రాజకీయంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

కార్యకర్తలే పార్టీకి బలం

ఎన్నికల సమయంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పొంగులేటి అభిప్రాయపడ్డారు. ప్రజల్లోకి వెళ్లి పార్టీ సందేశాన్ని తీసుకెళ్లడంలో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల కృషి ముఖ్యమని పేర్కొన్నారు. అంకితభావంతో పనిచేసే నాయకత్వం, బలమైన కార్యకర్తల బృందం తమకు అండగా ఉన్నాయని చెప్పారు. ఈ బలంతోనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుపు సాధిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

కశ్మీర్‌లో స్థానిక ఉగ్రవాదులు లేరు!

బందర్‌దేవా:

జమ్ముకశ్మీర్ చరిత్రలో కీలక పరిణామం చోటుచేసుకుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. 35 ఏళ్ల తర్వాత తొలిసారిగా కశ్మీర్ లోయలో ఒక్క స్థానిక ఉగ్రవాది కూడా మిగలలేదని స్పష్టం చేశారు. లష్కరే తొయిబాకు చెందిన చివరి క్రియాశీల స్థానిక ఉగ్రవాది మహమ్మద్ లతీఫ్ భట్ భద్రతా బలగాల ఎదురుకాల్పుల్లో హతమయ్యాడని తెలిపారు. ప్రస్తుతం లోయలో మిగిలిన ఉగ్రవాదులంతా విదేశీయులేనని పేర్కొన్నారు. ఈ పరిణామం దేశ భద్రతలో కీలక మైలురాయి అని అభివర్ణించారు.

అరుణాచల్‌ప్రదేశ్‌లోని బందర్‌దేవాలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కుల్గాం జిల్లాలో లతీఫ్ భట్ హతమైన నేపథ్యంలో కశ్మీర్‌లో స్థానిక ఉగ్రవాదుల ఉనికి పూర్తిగా అంతమైందని ప్రకటించారు. గురువారం ఢిల్లీలో జరిగిన వార్షిక ఉగ్రవాద వ్యతిరేక సదస్సులోనూ ఇదే విషయాన్ని ప్రస్తావించారు.

900 మందికి పైగా పోలీసులకు నియామకాలు

అరుణాచల్‌ప్రదేశ్ పర్యటనలో భాగంగా కొత్తగా ఎంపికైన 900 మందికి పైగా పోలీసు సిబ్బందికి అమిత్ షా నియామక పత్రాలు అందజేశారు. వ్యూహాత్మకంగా కీలకమైన ఈ రాష్ట్రంలో భద్రత, శాంతి, అభివృద్ధి దేశానికి ఎంతో అవసరమని చెప్పారు. చైనా, భూటాన్, మయన్మార్‌లతో సరిహద్దులు పంచుకుంటున్న అరుణాచల్‌ప్రదేశ్‌కు జాతీయ భద్రతలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని వివరించారు.

స్థానికుడి నుంచి కమాండర్ స్థాయికి

కుల్గాం జిల్లా ఖ్రేవాన్ చాదర్ గ్రామానికి చెందిన మహమ్మద్ లతీఫ్ భట్ లష్కరే తొయిబాలో కమాండర్‌గా ఎదిగాడు. నవంబర్ 18న భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో హతమయ్యాడు. 2025 నవంబర్ 19న తెల్లవారుజామున ఫజర్ నమాజ్ కోసం ఇంటి నుంచి వెళ్లిన అతడిని కుటుంబ సభ్యులు చివరిసారిగా చూశారని భద్రతా సంస్థల నివేదిక పేర్కొంది. స్థానికుడిగా ఉండటం వల్ల ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించడం అతడికి సులభమైందని, తక్కువ వ్యవధిలోనే స్థానిక కమాండర్‌గా ఎదిగాడని జమ్ముకశ్మీర్ మాజీ పోలీసు అధికారి ఎస్పీ వైద్ గతంలో పేర్కొన్నారు. పోలీసులతో పాటు పౌరులపైనా దాడులకు పాల్పడ్డాడని వివరించారు.

శాంతిభద్రతల సాకుతో జర్నలిస్టులను అడ్డుకోరాదు

సుప్రీంకోర్టులో ఎన్‌డబ్ల్యూఎంఐ వాదన

న్యూఢిల్లీ, నవంబర్ 21



జర్నలిస్టుల కార్యకలాపాల్లో జోక్యానికి శాంతిభద్రతల అధికారాలను సాకుగా చూపరాదని నెట్‌వర్క్ ఆఫ్ విమెన్ ఇన్ మీడియా, ఇండియా (ఎన్‌డబ్ల్యూఐఐ) సుప్రీంకోర్టుకు తెలిపింది. అక్టోబర్‌లో ఢిల్లీలో జరిగిన నిరసనలను కవర్ చేసిన మీడియా సిబ్బందిని బలవంతంగా నిర్బంధించి, దాడి చేశారని ఆరోపిస్తూ ఆ సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. ఎన్నికల సంఘం పనితీరులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌కు ప్రతిస్పందనగా ఎన్‌డబ్ల్యూఎంఐ రిజాయిండర్ సమర్పించింది.జర్నలిస్టులను అడ్డుకోవడం, బలవంతంగా తొలగించడం, దాడి చేయడం లేదా లైంగిక వేధింపులకు గురిచేయడం వంటివి వారి వ్యక్తిగత స్వేచ్ఛ, శారీరక భద్రత, వృత్తి నిర్వహణ స్వేచ్ఛతోపాటు సమాచారాన్ని సేకరించి ప్రజలకు అందించే పత్రికా స్వేచ్ఛపై ఒకేసారి దెబ్బపడుతుందని పేర్కొంది. 'సాయుధ ఘర్షణలు, ఇతర ప్రమాదకర పరిస్థితుల్లోనూ జర్నలిస్టులకు వార్తా సేకరణకు సాధారణంగా అవకాశం కల్పిస్తారు. ప్రమా దం ఎదురైనప్పుడు రిపోర్టర్‌ను అక్కడి నుంచి పంపించడం కాకుండా, వారికి రక్షణ కల్పిస్తూ రిపోర్టింగ్‌కు తోడ్పడటమే గుర్తించిన విధానం' అని సంస్థ తెలిపింది.

టీచర్లకు వార్డెన్ డ్యూటీల నుంచి విముక్తి కల్పించాలి

-ప్రత్యేక డిప్యూటీ వార్డెన్లు, కేర్‌టేకర్లను తక్షణమే నియమించాలి

-టీఎస్‌యూటీఎఫ్ ఎంజెపి ప్రధాన కార్యదర్శి కొండ్రపల్లి శ్రీను డిమాండ్

దేవరకొండ నవంబర్ 21 (మహాప్రభ)

గురుకుల విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులపై మోపుతున్న బోధనేతర బాధ్యతలను తక్షణమే తొలగించి, ప్రత్యేక డిప్యూటీ వార్డెన్లు, కేర్‌టేకర్లను నియమించాలని టీఎస్‌యూటీఎఫ్ ఎం.జె.పి. ప్రధాన కార్యదర్శి కొండ్రపల్లి శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల సొసైటీల్లో ఉపాధ్యాయులకు బోధనతోపాటు వార్డెన్ విధులు, ఇతర బోధనేతర బాధ్యతలు అప్పగించడం వల్ల వారు తీవ్ర మానసిక ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు విద్యార్థుల బోధన, మరోవైపు వసతి గృహాల నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడంతో ఉపాధ్యాయులు తమ బోధనపై పూర్తి ఏకాగ్రత చూపలేకపోతున్నారని పేర్కొన్నారు. ఫలితంగా బోధనా నాణ్యత దెబ్బతినడంతోపాటు విద్యార్థుల అకాడమిక్ ఫలితాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు.

విద్యాహక్కు చట్టం--2009లోని సెక్షన్ 27 ప్రకారం ఉపాధ్యాయులను బోధనేతర విధులకు వినియోగించడంపై స్పష్టమైన పరిమితులు ఉన్నాయని గుర్తుచేశారు. విద్యార్థుల విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని



ఉపాధ్యాయులను వార్డెన్ తదితర బోధనేతర బాధ్యతల నుంచి పూర్తిగా విముక్తి కల్పించి, ప్రత్యేక సిబ్బందిని నియమించాలని కోరారు.

అదేవిధంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనుకూలంగా లేని అశాస్త్రీయమైన గురుకుల పాఠశాలల పనివేళలను తక్షణమే సవరించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు:

1. ఉపాధ్యాయులకు వార్డెన్, ఇతర బోధనేతర విధుల నుంచి విముక్తి కల్పించాలి.
2. ప్రత్యేక డిప్యూటీ వార్డెన్లు, కేర్‌టేకర్లను నియమించాలి.
3. గురుకుల ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలి.
4. 2024లో నియమితులైన గురుకుల ఉద్యోగుల సర్వీసును వెంటనే క్రమబద్ధీకరించాలి.
5. రెండో పీఆర్సీని తక్షణమే అమలు చేయాలి.
6. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలి.
7. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలి.
8. ప్రభుత్వం ప్రతిపాదించిన ఈహెచ్‌ఎస్ కార్డులను గురుకుల ఉపాధ్యాయులకు క్రమబద్ధంగా మంజూరు చేసి సమర్థవంతంగా అమలు చేయాలి.
9. అర్హులైన ఉద్యోగులకు గెజిటెడ్ హోదా కల్పించాలి.
10. గెస్ట్ టీచర్లకు 12 నెలల వేతనం చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలి.
11. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా ఉన్న గురుకుల పాఠశాలల పనివేళలను మార్చాలి.

గురుకుల విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ఉపాధ్యాయులపై అనవసరమైన పనిభారాన్ని తగ్గించి, వారికి బోధనకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం అత్యంత అవసరమని కొండ్రపల్లి శ్రీను స్పష్టం చేశారు.

ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సామూహిక ప్రయోజనాలే ముఖ్యమని, గురుకుల ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, ఆత్మగౌరవం కోసం ఉపాధ్యాయులందరూ సంఘటితంగా ఉద్యమించి ఐక్యంగా తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయండి



దేవరకొండ నవంబర్ 21(మహాప్రభ)

సామాజికవేత్త. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ పిలుపు. దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23 తారీకు సోమవారం రోజు చేపట్టదలచిన బీసీ డిమాండ్లకై సత్యగహాదీక్షను అంబేద్కర్ విగ్రహం వద్ద విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీసీలకు ఆత్మ గౌరవం ఏర్పాటు చేయాలని, గత కొద్ది సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను తక్షణమే విద్యలు చేయాలని, నియోజకవర్గ కేంద్రంలో బీసీ కళాశాల హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, దేవరకొండ, కొండమల్లేపల్లి కేంద్రాల్లో ఫ్రీ మెట్రిక్ హాస్టలను ఏర్పాటు చేయాలని, బీసీ గురుకులాలకు సంత భవనాలు ఏర్పాటు చేయాలని, ఎస్సీ , మైనార్టీఎస్టీ హాస్టల్ లో కూడా సంత భవనాలు లేని చోట భవనాలు నిర్మాణం చేయాలని ప్రభుత్వానికి విన్నపిస్తూ సత్యాగ్రహ దీక్ష చేపట్టడం జరుగుతుంది. ఈ దీక్షకు సంఘీభావంగా అన్ని రాజకీయ పార్టీలు, అన్ని ప్రజా సంఘాలు, మేధావులు, కవులు కళాకారులు, అన్ని వర్గాల ప్రజలు సామాజిక కోణంలో ఆలోచించి మీనాక్షి సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు జరగబోయే ర్యాలీలో పాల్గొని సంఘీభావ మద్దతు తెలిపాలని కోరుతున్నాం. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో అప్పం వీరయ్య గడ్డం బిక్షమయ్య భాషనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో దళితుల భూములకు ఎసరు

Survey No 1421 లో మైనింగ్ టెండర్ల కలకలం। Medak Collector కి వినతి

-మైనింగ్ టెండర్లతో దళితుల భూములకు రక్షణ కరువు

రామంపేట నవంబర్ 21 మహాప్రభ

మైనింగ్ టెండర్లతో దళితుల భూములకు రక్షణ కరువు



మెదక్ జిల్లా, రామాయంపేట మండలం:నవంబర్ 21 (మహాప్రభ)

సర్వే నెంబర్ 1421లో గల దళితుల వ్యవసాయ భూములను మైనింగ్ పేరుతో కొల్లగొడుతున్నారని ఆరోపిస్తూ దళిత సంఘాల నాయకులు శనివారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.

గత 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఈ భూములకు ప్రభుత్వం పట్టా ధ్రువ పత్రాలు, పట్టా పాస్ పుస్తకాలు, 1బీ లు ఇచ్చిందని, అయినా మైనింగ్ శాఖ అధికారులు ఫేస్-1, ఫేస్-2 పేరుతో టెండర్లు వేసి, ఎటువంటి హద్దులు చూపకుండా కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అనుమతులు ఇచ్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్ ప్రాంతానికి కేవలం 200 మీటర్ల దూరంలోనే ప్రభుత్వ ప్రతిష్టాత్మక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం జరుగుతోందని, ఇక్కడ మైనింగ్ జరిగితే పాఠశాలకు, దళిత కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఈ భూముల్లో ఎలాంటి గుట్టలు లేవని, ఇదే తమ జీవనాధారమని, టెండర్లను రద్దు చేసి న్యాయం చేయాలని మైనింగ్ శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి గారికి, మెదక్ కలెక్టర్ గారికి విజ్ఞప్తి చేశారు. రద్దు చేయలేని ఎడల ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వీక్రూ రాష్ట్ర నాయకులు పాతూరి రాజు, మాలల హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మల మైసయ్య, దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ ఒలంపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రభంజనం

-జిల్లా స్థాయికి ఎంపికైన పీఎం శ్రీ జెడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థులు



గాంధారి నవంబర్ 21(మహాప్రభ)

మండల కేంద్రంలోని పీఎం శ్రీ జెడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇంగ్లీష్ ఒలంపియాడ్ మండల స్థాయి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సుజాత తెలిపారు.ఇంగ్లీష్ ఒలంపియాడ్ పల్లె శ్రీనిధి – మొదటి ర్యాంకుఎండి. అర్సలాన్ – రెండో ర్యాంకుజూనియర్ విభాగం కె. విగ్నేశ్వరి,మొదటి ర్యాంకుబి. గంగాప్రియ, రెండో ర్యాంకు ఉపన్యాస పోటీ ఎ.సింధు, జెడ్.పి.హెచ్.ఎస్ పోతంగల్, మొదటి ర్యాంకు టి. ప్రణవి, రెండో ర్యాంకు జూనియర్ ఉపన్యాస పోటీ:ఆర్. రమ్య – మొదటి స్థానం కె. విగ్నేశ్వరి – రెండో ర్యాంకువీరంతా జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీహరి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రాజా పండిత్, సిహెచ్. మల్లేష్, బాపూరావు, షేక్ మన్సూర్, రవికుమార్, సంగీత, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

దేవరకొండ ఎస్.పి.ఆర్ స్కూల్లో చిల్డ్రన్స్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా జరిగింది



దేవరకొండ నవంబర్ 21 (మహాప్రభ)

దేవరకొండ టౌన్ లోని మహబూబ్‌గర్ రోడ్ లో గల ఎస్ పి ఆర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కూల్లో శనివారం చిల్డ్రన్స్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పలు విధములైన వినోదాత్మకమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.విద్యార్థిని విద్యార్థుల కార్యక్రమాలు చూసి తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తంపరిచారు. పేరెంట్స్ మొబైల్లో వారి వారి విద్యార్థినిల విద్యార్థుల డ్యాన్సు కార్యక్రమాలను తల్లిదండ్రులు భద్రపరచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పిఆర్ ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ విద్యయే ప్రగతికి మెట్టు.నేటి బాలలే రేపటి పౌరులని తెలియపరచాలి. విద్యార్థిని విద్యార్థులు ఉన్నతమైన చదువులు చదివి శాస్త్ర సాంకేతిక వైద్య విజ్ఞాన రంగంలో అభివృద్ధి చెందాలని, ప్రతి విద్యార్థి లో ఒక ప్రతిభ దాగి ఉంటుందని గెలుపు ఒకటే ముఖ్యం కాదని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని తెలిపారు.ఆటలు పాటలు వినోదాలు చాలా ముఖ్యమైనవని. విద్యార్థులు తమలో దాగిన ప్రతిభను కనపర్చాలని తెలియపరచారు.మన దేశానికి పేరెంట్స్ కి మంచి పేరు తేవాలని సూచించారు. పట్టుదలతో క్రమశిక్షణతో విజయ్ శిఖరాలు అధిరోహించాలని వివరించారు. గతంలో చదివిన విద్యార్థిని విద్యార్థులు అన్ని రంగాలలో అభివృద్ధి చెంది తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచారని ఆయన గుర్తు చేశారు. మీ కలలను నిజశీ చేసుకొనె దిశగా చదవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రావణ్ కుమార్ స్పందన.లింగమయ్య శ్రీను. ప్రేమ్ కుమార్. కృష్ణమూర్తి మల్లికార్జున్. ఈషా శర్మ. శైలజ. భవాని లక్ష్మి. శిరీష. లత. .ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పేరెంట్స్ తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని ఆనందించారు

కుటుంబ కలహాలతో యువకుడి మృతి

-పెద్దవంగరలో విషాద ఘటన..

- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



పెద్దవంగర, నవంబర్ 21 (మహాప్రభ)

కుటుంబ సమస్యలతో తీవ్ర మనోవేదనకు గురైన ఓ వ్యక్తి మృతి చెందడంతో పెద్దవంగర గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన కొండ్ర జైపాల్ (35) శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండ్ర జైపాల్‌కు సుమారు 15 ఏళ్ల క్రితం విజయవాడకు చెందిన లక్ష్మితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత ఐదేళ్లుగా భార్యాభర్తల మధ్య కుటుంబ విషయాలకు సంబంధించి విభేదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో పది రోజుల క్రితం భార్య లక్ష్మి భర్తను విడిచి విజయవాడలోని పుట్టింటికి వెళ్లినట్లు మృతుడి తల్లి కొండ్ర ధనమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో జైపాల్ కొంతకాలంగా మనోవేదనకు గురవుతూ సరిగా భోజనం కూడా చేయడం లేదని తెలిపారు. శుక్రవారం రాత్రి భోజనం చేసి నిద్రించిన అనంతరం శనివారం తెల్లవారుజామున తల్లి లేచి చూసేసరికి జైపాల్ మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకున్నారు. మృతుడి మరణంపై తనకు ఎవరిపైనా అనుమానం లేదని తల్లి ఫిర్యాదు చేయడంతో పెద్దవంగర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివాహ వేడుకకు హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు



హైదరాబాద్, నవంబర్ 21 (మహాప్రభ)

కుర్తివాడ గ్రామానికి చెందిన రిపోర్టర్ మధుసూదన్ చారి శోభారాణి కుమార్తె వివాహానికి టివైజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా. తనుగుల జితేందర్ రావు శనివారం హాజరయ్యారు. కొత్తపల్లి లోని ఓ వేడుక మందిరంలో నూతన వధూవరులను వైష్ణవి,సురేష్ చారీ లను ఆయన ఆశీర్వదించారు. ఈసందర్భంగా రిపోర్టర్లు కిరణ్,రవి,స్వామి ,కృష్ణ,భాస్కర్,లక్ష్మణ్, దయానంద్,నర్సాగౌడ్,వెంకట్ తదితరులు ఉన్నారు.

దేవరకొండ పట్టణంలోని 17వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం దరఖాస్తుల ప్రారంభం



దేవరకొండ నవంబర్ 21(మహాప్రభ)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఎంపీపీ పిఎస్ పాఠశాల సంజయ్ కాలనీ లో 17వ వార్డు కో- ఆప్షన్ నెంబర్ వైయస్ కరుణాకర్, వార్డు కౌన్సిలర్ పొట్ట మధు తో కలిసి ప్రారంభించారు, ఈ సందర్భంగా వై.యస్.కరుణాకర్ మాట్లాడుతూ అర్హులైన 18 సంవత్సరాలు నిండి 59 సంవత్సరాలు లోపు వయసు కలిగిన ప్రతి కుటుంబం ఈ భీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఉచిత బీమా పథకాన్ని వార్డు ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు, ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ పవన్ ఆర్పీలు శమ్మా సుల్తానా, వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

వనపర్తి జిల్లా పెద్దగూడెం గ్రామం నుంచి ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం

-వనపర్తి ఎమ్మెల్యేతుడి మేఘారెడ్డి

-వనపర్తి జిల్లా పెద్దగూడెం గ్రామం నుంచి జిల్లావ్యాప్తంగా ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి

-సంపాదించే యజమాని మరణిస్తే కుటుంబం రోడ్డున పడకుండా ప్రతి కుటుంబానికి బీమా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోంది : వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

-పెద్దగూడెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి

-ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా -- 18 నుంచి 59 ఏళ్ల వారు అర్హులు : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి నవంబర్ 21 మహాప్రభ

వనపర్తి జిల్లాకు సంబంధించి ఇందిరమ్మ కుటుంబ భీమా పథకాన్ని శనివారం పెద్దగూడెం గ్రామంలో శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి, స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ కొత్తకాపు శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ సంపాదించే యజమాని మరణిస్తే కుటుంబం రోడ్డున పడకుండా ప్రతి కుటుంబానికి బీమా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. నవంబర్ 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రారంభించారని, వనపర్తి జిల్లాలోని 268 గ్రామపంచాయతీలు, 80 మున్సిపల్ వార్డులలో నేటి నుండి నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. జిల్లాలో ఈ పథకం ప్రారంభ కార్యక్రమాన్ని పెద్దగూడెం గ్రామంలో నిర్వహించడం సంతోషకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంపు, రైతు భరోసా, రైతు బీమా, గృహలక్ష్మి, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. వనపర్తిలో సుమారు 35 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, మహిళా సంఘాలకు వివిధ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

గతంలో రాజశేఖర రెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ప్రస్తుతం మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. వనపర్తి నియోజకవర్గానికి 5,500 ఇళ్లు మంజూరు కాగా, పెద్దగూడెం గ్రామానికి ఇప్పటికే 62 ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇల్లు లేని అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని, ఇంటి స్థలాల పట్టాల సమస్యలను కూడా పరిష్కరించామని తెలిపారు. ఇటీవల కొత్త పెన్షన్లు మంజూరు చేశామని, సాగునీటి విషయంలో ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జరుగుతున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్యే సూచించారు. ఏడాదికి సరిపడా ఆహార ధాన్యాలు రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నీరు, విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని సూచించారు. వీబీజీ రామ్ జీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, పెద్దగూడెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకంలో ప్రతి ఒక్కరూ నమోదు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, పెద్దగూడెం గ్రామం నుంచి జిల్లాలో ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించడం సంతోషకరమన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల వారు ఈ పథకానికి అర్హులని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రతిరోజూ 50 కుటుంబాల చొప్పున వచ్చి బీమా నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అర్హులైన వారు తమ వివరాలతో పాటు నామినీ వివరాలను అందించి నమోదు చేసుకోవాలని సూచించారు. కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో నామినీకి రూ. 5 లక్షల బీమా పరిహారం అందుతుందని, నమోదు ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుందని, నమోదు పూర్తయిన అనంతరం సంబంధిత వ్యక్తికి సందేశం అందుతుందని వివరించారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, పెద్దగూడెం గ్రామంలో ఇంత గొప్ప పథకాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గతంలో భూమి ఉన్న రైతులకు మాత్రమే బీమా ప్రయోజనాలు అందేవని, భూమిలేని పేద కుటుంబాలకు బీమా అందకపోవడంతో ఎదురైన సమస్యలను గుర్తించిన ముఖ్యమంత్రి ప్రతి కుటుంబానికి భరోసా కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా, రోడ్డున పడకుండా ఆదుకోవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. నవంబర్ 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రారంభించారని, మరుసటి రోజు నుంచి గ్రామపంచాయతీ కార్యాలయంలో కుటుంబ పెద్దల పేరుతో బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. పెద్దగూడెం గ్రామంలో సుమారు 950 కుటుంబాలు ఉన్నాయని, ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధి గురించి మాట్లాడుతూ, గతంలో ఉన్న ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించామని, డ్రైనేజీలు, సీసీ రోడ్ల పనులను త్వరలో పూర్తి చేసి పెద్దగూడెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గ్రామంలో కొత్తగా 55 మందికి పెన్షన్లు మంజూరు చేశామని, ఇంకా అర్హులైన వారు ఉంటే వారికి కూడా పెన్షన్లు అందిస్తామని చెప్పారు. ఇల్లు లేని వారికి ఇళ్లను మంజూరు చేశామని, ఇంకా అర్హులు ఉంటే వారికి కూడా ఇళ్లు అందిస్తామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఐదుగురు కుటుంబీకులకు ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం నమోదు పత్రాలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఇందిరమ్మ ప్రచార పత్రాన్ని అలాగే ఖేలో ఇండియా పోటీలకు సంబంధించిన గోడ పత్రిక, మస్కట్ ను విడుదల చేశారు. అంతకుముందు మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, వనపర్తి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్లు మాధవి, శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్, జడ్పీ సీఈఓ యాదయ్య, డీపీవో రామ మహేశ్వర్, గ్రామ సర్పంచ్ పుష్పలత, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతిగూడెం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ జీవిత బీమా పథకానికి ప్రారంభం.



దేవరకొండ డివిజన్ నవంబర్ 21 (మహా ప్రభ)

డిండి గుండ్లపల్లి ఎంపీడీవో వేగన్న శాంతిగూడెంసర్పంచ్ డిండి మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జిల్లా సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ వారికి సన్మానం చేసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించడం జరిగినది ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోగతంలోభూములు ఉన్న వారికి రైతు బీమా వర్తించేదికానీమనతెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి భూమిలేని నీరు పేదలు వికలాంగులు వితంతువులుఅంగవైకల్యం వాళ్లందర్నీదృష్టిలోఉంచుకొని ఈ ప్రజా ప్రభుత్వంలో ఇంటి యజమాని ఎవరైతే ఉన్నారో వారికి ఇందిర బీమా పథకం ఐదు లక్షల రూపాయలు వర్తించే విధంగా వారికి రేపటి రోజున కుటుంబ పెద్దలు ఏమైనా జరగరానిది జరిగితే వారి కుటుంబాలకు 5 లక్షల రూపాయలు వర్తించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆలోచించే ప్రజలకు న్యాయం చేకూరేలా ఈ నిర్ణయం ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం మన రేవంత్ రెడ్డి సర్కారు అతిపెద్ద ఎత్తున ఇ నిర్ణయం తీసుకోవడం జరిగినది అందులో భాగంగా ఈరోజు ప్రోగ్రాం లో పాల్గొన్న అధికారులు డిండి మండల ఏపీఓ శ్రీనివాస్ టెక్నికల్ అసిస్టెంట్ శేఖర్ గారు పంచాయితీ సెక్రటరీ వేణు గారు శాంతి గూడెం గ్రామ మాజీ సర్పంచ్ చింతలపూడి ఇందిరా గ్రామ పెద్దలు వెంకటేశ్వర రెడ్డి కోల పిచ్చయ్యకొవ్వూరిపుల్లారావు మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

నూతన వధూవరులను ఆశీర్వదించి బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్.



దేవరకొండ దేవరకొండ డివిజన్ నవంబర్ 21 (మహాప్రభ)

నేరడగొమ్మ మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ కి చెందిన కొల్ముల పల్లి వెంకటయ్య కుమారుడు ఏడుకొండలువివాహకార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్ ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ గడ్డం రమేష్, కృష్ణ, నాగరాజు, హరికృష్ణ, యాదగిరి, గన్నయ్య, కృష్ణ, అనిల్ నేనావత్ నరసింహ నాయక్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ నియోజకవర్గంలోని హాస్టళ్లలో అక్రమాలు, నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

-చింతపల్లి సతీష్ గౌడ్.



దేవరకొండ డివిజన్ నవంబర్ 21 (మహాప్రభ)

దేవరకొండ నియోజకవర్గం లోని హాస్టల్లోమెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి. సమయపాలన పాటించని వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకుఅందించాల్సిన సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్లపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ యువజనజేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సతీష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారంఅందించాల్సిన బాధ్యత వార్డెన్లపైఉందన్నారు. కానీ కొన్ని హాస్టళ్లలో మెనూ అమలుచేయకుండా ఇష్టానుసారంగా భోజనం అందిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే విధుల పట్లబాధ్యత లేకుండా సమయపాలన పాటించని వార్డెన్లకారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనిఆవేదన వ్యక్తం చేశారు. హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యం,భద్రత, విద్యకుప్రాధాన్యతఇవ్వాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం.తగదన్నారు.సంబంధితశాఖలఉన్నతాధికారులు దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, మెనూ అమలు, భోజన నాణ్యత, వార్డెన్ల హాజరు, సమయపాలనపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతోచెలగాటమాడుతున్న వార్డెన్లపై విచారణ జరిపికఠినచర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి,పౌష్టికాహారంఅందించడం ప్రభుత్వ బాధ్యత అని,ఆబాధ్యతను విస్మరించే అధికారులను ఉపేక్షించకూడదని చింతపల్లి సతీష్ గౌడ్ స్పష్టం చేశారు.

కేజీబీవీ విద్యార్థినులకు ప్రభుత్వ కానుకల పంపిణీ

-సర్పంచ్ చేతుల మీదుగా బంకర్ బెడ్స్, స్కూల్ కిట్లు అందజేత



గాంధారి నవంబర్ 21 (మహాప్రభ)

మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినుల కోసం ప్రభుత్వం అందించిన బంకర్ బెడ్స్ ను సర్పంచ్ రేణుక సంజువ్ యాదవ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు స్కూల్ బ్యాగులు, ట్రంక్ బాక్సులు, ప్లేట్లు, గ్లాసులు, ఐడీ కార్డులు, బెల్టులు, టైలు, వైట్ షూస్, బ్లాక్ షూస్, సాక్స్ తదితర కానుకలను అందజేశారు.ప్రభుత్వం అందించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థినులు చదువులో రాణించాలని సర్పంచ్ రేణుక సంజువ్ యాదవ్ సూచించారు.

పారిశుద్ధ్య కార్మికురాలు పై దాడి చేసిన వ్యక్తిని తక్షణమే అరెస్ట్ చేయాలి,

--24 గంటలలో అరెస్ట్ చేయకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో జిల్లా బంద్ కు పిలుపునిస్తాం,

-ముదిగొండ ఎల్లేష్ మాదిగ ఎం ఆర్ పి ఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షులు



దేవరకొండ నవంబర్ 21 (మహాప్రభ

నల్గొండ పట్టణ కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికురాలైన దళిత మహిళపై దాడి జరిగిన ఘటనను ఎం ఆర్ పి ఎస్ తీవ్రంగా ఖండిస్తున్నామని ఎం ఆర్ పి ఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షులు ముదిగొండ ఎల్లేష్ అన్నారు,పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యం కోసం కష్టపడుతున్న పారిశుద్ధ్య కార్మికురాలు పై దాడులు చేయడం అమానుషం. ముఖ్యంగా దళిత మహిళపై దాడి జరగడం అత్యంత బాధాకరం. ఈ ఘటనపై అధికారులు తక్షణమే స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు, 24 గంటల్లో నిందితుడిని అరెస్ట్ చేయకపోతే, దళిత సంఘాల ఆధ్వర్యంలో జిల్లా బంద్‌కు పిలుపునిచ్చి, పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం అని పేర్కొన్నారు, దళితుల ఆత్మగౌరవం, మహిళల భద్రత, కార్మికుల హక్కుల కోసం ఎం ఆర్ పి ఎస్ నిరంతరం పోరాడుతుందని,బాధితురాలికి న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదని అన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన

కల్పించిన చండి సర్పంచ్ ప్రవీణ్ గౌడ్

-నీటి ఎద్దడి, విద్యుత్ సమస్యలు, చెరువుల కబ్జాలు, ఉపాధి హామీ రహదారుల ధ్వంసంపై గ్రామసభలో చర్చ



శివ్వంపేట నవంబర్ 21(మహాప్రభ)

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని చండి గ్రామంలో ఎల్‌నినో ప్రభావం, రానున్న రోజుల్లో ఎదురయ్యే వాతావరణ పరిస్థితులు, గ్రామ సమస్యలపై సర్పంచ్ ప్రవీణ్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పరిధిలోని చెరువులు, కుంటలు కబ్జాలకు గురికాకుండా పరిరక్షించాలని, వాటి హద్దులను కాపాడేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామసభలో చర్చించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన రహదారులను దున్నివేయడం వల్ల ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. గ్రామాభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గ్రామ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ గ్రామసభలో ఎంపీడీవో వెంకటలక్ష్మి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఏపీఓ అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వీణ, వ్యవసాయ శాఖ అధికారి, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మణిగిల్ల శివ యాదవ్ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే దంపతులు!!



వనపర్తి నవంబర్ 21 మహాప్రభ
పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామానికి చెందిన శివ యాదవ్, రాముల యాదవ్ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాలకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సతీమణి శారదా రెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలియజేస్తూ నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు సొంత ఇల్లు నిర్మించుకోవడం ఒక కళాని దాన్ని నిలబెర్చుకున్న నాడే మనిషి జీవితం సార్థకత అవుతుందని వారున్నారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దలు యువకులు గ్రామస్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

నిఘా నేత్రాలతో నేరస్తులకు చెక్

-సీసీ కెమెరాలతో నేరస్తులను సులభంగా గుర్తించవచ్చు
-ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు





గాంధారి, నవంబర్ 21 (మహాప్రభ)
సీసీ కెమెరాలతో నేరస్తులను సులభంగా గుర్తించవచ్చని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం గాంధారి మండలంలోని తిప్పారం తండాలో స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ,. తిప్పారం తండావాసులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.2.50 లక్షలతో తండాలో 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా గ్రామాల్లోకి వచ్చే కొత్త వ్యక్తులతో పాటు నేరస్తులను సులభంగా గుర్తించవచ్చని, సీసీ కెమెరాలు ప్రజల భద్రతకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న తిప్పారం తండావాసులను మండలంలోని ఇతర గ్రామాల ప్రజలు ఆదర్శంగా తీసుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.యువకులు చెడు వ్యసనాలతో పాటు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలపై తండావాసులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తండా సర్పంచ్ గంగారం నాయక్, సదాశివనగర్ సీఐ వీరయ్య, గాంధారి ఎస్సై మహేందర్, మాజీ సర్పంచ్ బిషన్ నాయక్, టిక్య నాయక్ తో పాటు తండావాసులు పాల్గొన్నారు.

మత్స్యకారుల దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేసిన బండారి గంగాధర్...,



శివ్వంపేట నవంబర్ 21(మహాప్రభ)
ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా హైదరాబాదులోని ఇందిరాపార్క్ లోని కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మత్స్యకారుల భవన్ హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ మురళి కృష్ణ ని కలిసి మత్స్యకారుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అలాగే రాష్ట్రంలో గంగపుత్రుల అభివృద్ధి గురించి ముఖ్యమైన విషయాలు చర్చించడం జరిగింది. నేడు ప్రపంచ మత్స్యకారుల గంగపుత్రులందరికీ అందరికీ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది గౌరవ గంగపుత్ర రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు మాదరబోయిన నరసయ్య. గౌరవ ఉపాధ్యక్షులు రాచకట్ల శంకర్ అలియాస్ శ్రీధర్. గౌరవ సలహాదారులు రానా బోయిన లక్ష్మణ్. కోశాధికారి పెద్ద బోయిన దయానంద్. జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ బోర్డు డైరెక్టర్ మురళీకృష్ణ గంగపుత్ర సభ్యులు తదితరులు పెద్దలు పాల్గొన్నారు....,

నూతన పోలీస్ స్టేషన్ల భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి

- ఎమ్మెల్యే బాలు నాయక్



దేవరకొండ నవంబర్ 21(మహాప్రభ)
రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మండలాలతో పాటు అవసరమైన ప్రాంతాల్లో పోలీస్ స్టేషన్ల ఏర్పాటుపై డీజీపీ సీవీ ఆనంద్‌తో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశం రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన మండలాల్లో, అలాగే పోలీస్ స్టేషన్లు అవసరమైన ప్రాంతాల్లో నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, భవన నిర్మాణాలకు సంబంధించిన పలు అంశాలపై దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మండలాలు, పోలీస్ స్టేషన్లు లేని ప్రాంతాలు, ప్రస్తుతం ఉన్న పోలీస్ స్టేషన్లకు భవన సదుపాయాల అవసరం తదితర అంశాలను డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావాలంటే అవసరమైన ప్రాంతాల్లో నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, సొంత భవనాల నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకతను వివరించారు. ముఖ్యంగా దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని నూతన మండలాలు, మారుమూల ప్రాంతాల ప్రజలకు పోలీసు సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా అవసరమైన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని, పోలీస్ స్టేషన్లకు తగిన భవనాలు, సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, భవన నిర్మాణాలకు సంబంధించిన అంశాలపై డీజీపీతో చర్చించారు.

ఉపాధి హామీ పనులు పకడ్బందీగా చేపట్టాలి





-కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలి..
-నిధుల దుర్వినియోగాన్ని సహించేది లేదు: డీఆర్‌డీఏ పీడీ వామన్‌రావు
-మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం

దేవరకద్ర, నవంబర్ 21 (మహా ప్రభ):
గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పనులు నిబంధనల మేరకు పారదర్శకంగా చేపట్టాలని, పనులు చేసిన ప్రతి కూలీకి ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు సక్రమంగా, సకాలంలో అందేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వామన్‌రావు స్పష్టం చేశారు. ఉపాధి హామీ నిధుల వినియోగంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని, క్షేత్రస్థాయిలో పనుల అమలును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.
దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం దేవరకద్ర మండల పరిధిలోని 18 గ్రామాల్లో అమలవుతున్న వి.బి.–జి రామ్ జి ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా పనుల అమలు తీరు, కూలీలకు చెల్లించిన వేతనాలు, జాబ్‌కార్డుల నిర్వహణ, రికార్డుల వివరాలను అధికారులు సమీక్షించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.క్షేత్రస్థాయిలో వెలుగులోకి వచ్చిన లోపాలు సామాజిక తనిఖీలో భాగంగా సీఆర్పీలు సమర్పించిన నివేదికలు పలు అంశాలను వెలుగులోకి తెచ్చాయి. కొన్ని గ్రామాల్లో వాస్తవంగా ఉపాధి పనులు చేపట్టకపోయినా, పనులు జరిగినట్లు రికార్డుల్లో నమోదు చేసి చెల్లింపులు జరిపినట్లు సీఆర్పీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మరికొన్ని గ్రామాల్లో జాబ్‌కార్డుల నిర్వహణలోనూ లోపాలు ఉన్నట్లు వెల్లడించారు. గ్రామాల వారీగా నిర్వహించిన సామాజిక తనిఖీ వివరాలను సమావేశంలో సమీక్షించారు.

రూ.6,458 రికవరీకి చర్యలు
మండలంలోని మొత్తం 18 గ్రామాలకు సంబంధించి సామాజిక తనిఖీలో గుర్తించిన అవకతవకల నేపథ్యంలో రూ.6,458 రికవరీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉపాధి హామీ పథకం నిధులు నిర్దేశిత పనులకే వినియోగించాల్సి ఉంటుందని, నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు జరిగితే బాధ్యుల నుంచి రికవరీకి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పనుల అమలులో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
ఈ సందర్భంగా వామన్‌రావు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉపాధి పనులు అవసరమైన కూలీలకు పనులు కల్పించడంతోపాటు, చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కూలీలు చేసిన పనికి తగిన వేతనం అందేలా చూడాలని, తప్పుడు నమోదు, అక్రమ చెల్లింపులకు ఆస్కారం లేకుండా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.
సామాజిక తనిఖీ ద్వారా గుర్తించిన లోపాలను సరిదిద్దుకుని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం లక్ష్యం గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించి వారి ఆర్థిక స్థితిగతులకు భరోసా కల్పించడమేనని, ఆ లక్ష్యం నెరవేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
ఈ సమావేశంలో ప్రేమలత, మంజుల, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవోలు, సీఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

-ముదిరాజులంతా ఐకమత్యంగా ఉండాలి..
- పాపన్నపేట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ముశెట్టి కిష్టయ్య ముదిరాజ్



పాపన్నపేట, నవంబర్ 21(మహాప్రభ)
ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని పాపన్నపేట మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలో పాపన్నపేట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ముశెట్టి కిష్టయ్య ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజుల హక్కులు, మత్స్యకారుల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐకమత్యంగా ఉండి సమష్టిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. హక్కుల పరిరక్షణ, సామాజిక అభివృద్ధి కోసం సంఘటితంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పుట్టి కిరణ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కర్రల వెంకట్, పాపన్నపేట గ్రామ అధ్యక్షుడు బుడాల మానయ్య, వెంకటేశం, విట్టల్, లక్ష్మణ్, తోట్ల నరేష్, ఆంజనేయులు, భాగయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఉపసభాపతి పద్మా దేవేందర్ రెడ్డి.

పపన్నపేట నవంబర్21(మహాప్రభ)
పాపన్నపేట మండలంలోని కుర్తివాడ గ్రామానికి చెందిన పత్రికా విలేఖరి మధుసూదన్ చారి కుమార్తె వైష్ణవి వివాహం శనివారం హైదరాబాద్ కు చెందిన సురేష్ చారితో ఘనంగా జరిగింది. మండల కేంద్రంలోని కొత్తపల్లి గ్రామంలో ఉన్న అనంత పద్మనాభ స్వామి ఫంక్షన్ హాల్‌లో వివాహ వేడుక వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు మాజీ శాసనసభ ఉపసభాపతి యం. పద్మా దేవేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులు వైష్ణవి, సురేష్ చారిలను ఆశీర్వదించారు.వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జగన్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వడ్ల కుబేరుడు, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, బద్రి, మల్లేశం, నాయకులు మన్నె వెంకటేశం, కిరణ్ ,దుర్గయ్య, రాజు, దత్తు, రాము, విల్సన్, సాయి బాబా,నవీన్, గోపాల్, తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శు భాకాంక్షలు తెలిపారు.

ఆపదలో ఉన్న పేద కుటుంబానికి ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అండ

-మావూరి సత్తయ్య వైద్య చికిత్సకు రూ.2 లక్షల ఎల్ఓసీ ఆర్థిక సహాయం అందజేత



వెల్దుర్తి నవంబర్21(మహాప్రభ)
ఆపదలో ఉన్న పేద కుటుంబానికి అండగా నిలుస్తూ నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎల్దుర్తి మండలం ఎల్దుర్తి గ్రామానికి చెందిన మావూరి సత్తయ్య కుటుంబానికి వైద్య చికిత్స ఖర్చుల నిమిత్తం రూ. 2 లక్షల ఎల్ఓసీ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం ద్వారా ఎమ్మెల్యే భరోసా కల్పించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేయడం అభినందనీయమని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచి, వైద్య చికిత్స కోసం రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డికి మావూరి సత్తయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల సుఖదుఃఖాల్లో భాగస్వామిగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

శివ్వంపేట మండలంలో గృహప్రవేశ వేడుకలు, పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే



శివ్వంపేట నవంబర్ 21(మహాప్రభ)
ప్రజలతో మమేకమవుతూ వారి సుఖదుఃఖాల్లో పాలుపంచుకుంటున్న నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి శివ్వంపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమాలు, పరామర్శ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహాల్లో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలు, కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండటమే తన బాధ్యత అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.
ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ .



దేవరకొండ నవంబర్ 21(మహాప్రభ)
దేవరకొండ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడిమర్రి రఘు రాములు కుమార్తె వివాహ కార్యక్రమం హైద్రాబాద్ తుర్కయంజాల్ లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్, అభిమానులు. నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

మనస్థాపం చెంది యువకుడు ఆత్మహత్య

డబ్బులు డిమాండ్ చేయడంతో తీవ్ర మనోవేదనకు గురై...

గాంధారి నవంబర్ 21(మహాప్రభ)
దొంగతనం అనంతరం దొరికిన యువకుడిని కొందరు డబ్బులు డిమాండ్ చేయడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా గాంధారి మండల కేంద్రంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. గాంధారి మండలం కేంద్రంలో కోదండ ప్రకాష్ (22) పాత ఇనుప సామాన్లు సేకరించి విక్రయించి జీవనం సాగించేవాడు.గత వారం రోజుల క్రితం దుర్గా నగర్ కాలనీలో ఓ ఇంటి ఆవరణంలోని పాత ఇనుమును దొంగిలించి ఓ పాత ఇనుప సామాను దుకాణదారునికి విక్రయించాడు. ఈ విషయం తెలుసుకున్న ఇంటి యజమాని ప్రకాశ్ ను నిలదీసి, దొంగిలించిన సామాన్లు తిరిగి తీసుకోవడంతో పాటు మరికొంత నగదు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు.దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ప్రకాష్ మండల కేంద్రం శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మృతుడి అన్న రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

పేద ప్రజల రేషన్ బియ్యం అక్రమ తరలింపు

-పట్టపగలే డీసీఎం (ఎ.పి.16 టిఎస్ 9648) వాహనంలో బ్లాక్ మార్కెట్‌కు రవాణా

-సివిల్ సప్లై, విజిలెన్స్ అధికారుల పర్యవేక్షణ లోపంపై స్థానికుల ఆగ్రహం

- ఆర్‌టీఐ సమాచార హక్కుల ప్రచార్ సమితి రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్



దేవరకొండ నవంబర్ 21 (మహాప్రభ)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కడుపు నింపాలనే సదుద్దేశంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న సివిల్ సప్లై సన్న బియ్యం పక్కదారి పడుతున్నాయి. దేవరకొండ పట్టణంలోని షాప్ నెంబర్ 18 పరిధిలో రేషన్ సన్న బియ్యాన్ని ఎ. పి. 16 టి ఎస్. 9648 నెంబర్ గల డీసీఎం వాహనంలో 14,744 కిలోల (సుమారు 147 క్వింటాళ్ల) బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న దృశ్యాలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంపై ఆర్‌టీఐ సమాచార హక్కుల ప్రచార్ సమితి రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్ స్పందించారు.

పేద ప్రజలకు చేరాల్సిన రేషన్ బియ్యం, కొందరు రేషన్ డీలర్లు మరియు దళారుల కుమ్మక్కుతో యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి పేదలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందిస్తుంటే, కొందరు డీలర్లు దళారులతో చేతులు కలిపి అక్రమ దందాకు తెరలేపారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టపగలే, ఎవరి భయం లేకుండా ఎ ఎ. పి. 16 టిఎస్ 9648 డీసీఎం వాహనంలో ఏకంగా 14,744 కిలోల సన్న బియ్యాన్ని తరలిస్తున్నా సంబంధిత పౌరసరఫరాల శాఖ (సివిల్ సప్లై) మరియు విజిలెన్స్ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే రేషన్ మాఫియా రెచ్చిపోతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, సివిల్ సప్లై మరియు విజిలెన్స్ విభాగాలు తక్షణమే స్పందించి దేవరకొండ పట్టణంలోని రేషన్ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, సన్న బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న డీలర్లు, దళారులపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేసి పేదలకు న్యాయం చేయాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సర్వేల్ గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ప్రారంభం

-గ్రామ సర్పంచ్ చిలకరాజు చందన రాజు



నారాయణపురం రిపోర్టర్ నవంబర్ 21(మహాప్రభ)
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని సర్వేల్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం సర్వేల్ గ్రామ సర్పంచ్ చిలక రాజు చందన రాజు మాట్లాడుతూ. నిరుపేదల కుటుంబాలకు ప్రభుత్వం ధీమా కల్పించేందుకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పేదల ప్రభుత్వం.. కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. పేదలకు నాడు భూములు పంచినా, నేడు యజమాని చనిపోతే కుటుంబానికి భరోసా ఇచ్చేందుకు బీమా తీసుకువచ్చినా కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనమన్నారు. నిరుపేద కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా ప్రయోజనం అందించడమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కట్కూరి భాస్కర్ గౌడ్, వార్డ్ మెంబర్లు బోయ చందు, ఈసం సరిత కిరణ్ , గోరటి శివశంకర్, సిలివేరు సువర్ణ గాలయ్య, ఎల్లంకి శైలజ నరేష్, గడ్డమీది రమాదేవి నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మగారిగుట్టపై వీరబ్రహ్మేంద్రస్వామికి విశేష పూజలు

- భక్తిశ్రద్ధలతో పంచామృత అభిషేకాలు.. త్వరలో అన్నదాన కార్యక్రమం



నల్లగొండ, నవంబర్ 21 (మహాప్రభ)
కార్తీక మాసం, జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 418వ జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని నల్లగొండలోని బ్రహ్మగారిగుట్టపై శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుట్టపై ఉన్న బారగు వృక్షం వద్ద విశ్వబ్రహ్మజ్ఞాన సేవా సంస్థ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణతో పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదమంత్రాలు, భక్తి పారవశ్యంతో బ్రహ్మగారిగుట్ట ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కార్తీక మాసం పవిత్రతను చాటుతూ, వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలనే సంకల్పంతో ప్రత్యేక పూజలు చేపట్టినట్లు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని, సమాజంలో ఆధ్యాత్మిక చింతన, ధార్మిక భావాలు మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. త్వరలో స్వామివారికి మరోసారి పంచామృత అభిషేకాలు నిర్వహించడంతో పాటు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రహ్మజ్ఞాన సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు దాసోజు యాదగిరాచారి, పెండ్యాల సోమయ్య, సంస్థ గౌరవ అధ్యక్షుడు శ్రీపాద కృష్ణమాచారి, మహాజన ప్రతినిధులు పర్వతం శోభారాణి, తొవిటి ఇంద్రాణి, పూర్జారి పోలీసు శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

ఏళ్ల నిరీక్షణకు ఫలితం.. దివ్యాంగుడు ప్రవీణ్‌కు పెన్షన్ మంజూరు

లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పెన్షన్ మంజూరు పత్రాలు అందజేసిన సర్పంచ్ మమత నర్సింలు



శివంపేట నవంబర్ 21(మహాప్రభ)
మెదక్ జిల్లా శివంపేట మండలం దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు గొల్ల ప్రవీణ్ ఎన్నో సంవత్సరాలుగా ఆసరా పెన్షన్ కోసం ఎదురుచూస్తుండగా, ఎట్టకేలకు ఆయనకు నూతనంగా పెన్షన్ మంజూరైంది. దీంతో ప్రవీణ్ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మమత నర్సింలు, ఉపసర్పంచ్ రవి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ప్రవీణ్ ఇంటికి వెళ్లి పెన్షన్ మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఎన్నో ఏళ్లుగా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న తమ కుటుంబానికి ఈ మంజూరు ఎంతో ఊరటనిచ్చిందని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం అభినందనీయమని పేర్కొంటూ సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా గ్రామపంచాయతీ పాలకవర్గం కృషి చేస్తుందని ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు.

మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ అధ్యక్షునిగా ఆబోతు వెంకటేష్
యాదవ్,ని నియమించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్....



మెదక్ నవంబర్ 21(మహా ప్రభ)
ఈరోజు మెదక్ జిల్లాకు వచ్చిన బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ అధ్యక్షునిగా నియాకం చేసిన ఉత్తర్వులు బీసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మెట్టు గంగారంతో కలిసి అందజేశారు. ఈ నియామకము వెంటనే అమల్లోకి వస్తుందని తెలియజేశారు ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ అధ్యక్షులు ఆబోతు వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ కు,కృతజ్ఞతలు తెలిపారు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నవారు తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ అధ్యక్షులు. కుర్మచర్ల శ్రీనివాస్ . మరియు తెలంగాణ రాష్ట్ర మహిళా బీసీ సంఘం అధ్యక్షురాలు మనీ మంజరి. మెదక్ జిల్లా బీసీ యువజన సంఘం అధ్యక్షులు పోచమల్ల గణేష్, బీసీ సంఘం ఉపాధ్యక్షులు చిన్న లింగు మల్లికార్జున్ గౌడ్ . ఇతర మహిళా సంఘం మరియు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు...

ఆఫీసర్‌ను సస్పెండ్ చేసిన కలెక్టర్



/మహబూబాబాద్ జిల్లా , తొర్రూరు:- నవంబర్ 21 (మహాప్రభ)
తొర్రూరు పట్టణంలోని 1, 9వ వార్డులలో వార్డు ఆఫీసర్ గా పనిచేయుచున్న జె.మీనేశ్వర్, రెండు పడకల గదుల కేటాయింపులలో లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేసినందున అట్టి విషయం రుజువైనందున..సదరు ఉద్యోగిపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధుల నుండి తొలగించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలు, లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేస్తే సంబంధిత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రెండు పడకల గదులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తామని మాయమాటలు చెబితే డబ్బులు అడిగితే వెంటనే సమాచారం అందించాలని, ప్రభుత్వ ఉద్యోగులు నిస్వార్థమైన, పారదర్శకమైన, బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.

తెలుగు ప్రేక్షకుల ముందుకు 'ఫూలే'..

నవంబర్ 27న గ్రాండ్ రిలీజ్!



సామాజిక సంస్కరణల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహనీయులు జ్యోతిరావ్ ఫూలే, సావిత్రిబాయి ఫూలే జీవిత పోరాటం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'ఫూలే'. సమాజంలో నెలకొన్న కులవివక్ష, అసమానతలు, మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఫూలే దంపతుల స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించారు. ప్రముఖ దర్శకుడు అనంత్ మహదేవన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సుపదా క్రియేషన్స్ బ్యానర్‌పై డా. పాన్నం రవిచంద్ర నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తెలుగు డబ్బింగ్ పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది.తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా వీక్షించింది. ఇక సినిమా వీక్షించిన అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కులవివక్ష నిర్మూలన, మహిళా విద్య కోసం ఫూలే దంపతులు చేసిన పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వారి సామాజిక సేవ, జీవిత ఆశయాలు నేటి సమాజానికి అత్యంత అవసరమైన సందేశాన్ని అందిస్తాయని అభిప్రాయపడ్డారు. 'ఫూలే' కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, సమాజంలో మార్పు కోసం పోరాడిన ఇద్దరు మహనీయుల జీవితాలను, వారు ఎదుర్కొన్న అడ్డంకులను కళ్లకు కట్టే ఒక చారిత్రాత్మక కథనమని చిత్ర బృందం పేర్కొంది. నేటి యువత, విద్యార్థులు ఫూలే దంపతుల జీవితం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, సమానత్వం, విద్య, మానవత్వం వంటి విలువలను గుర్తుచేసే ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ థియేటర్లలో వీక్షించి ఆదరించాలని నిర్మాత డా. పాన్నం రవిచంద్ర, చిత్ర బృందం విజ్ఞప్తి చేశారు.

కీర్తి సురేశ్ 'సత్యవాన్ సావిత్రి'కి ఊహించని ఓపెనింగ్స్.. తొలి రోజే షాక్!



నటి కీర్తి సురేశ్ వరుసగా విభిన్న కథా చిత్రాలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల 'డొరోతీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె.. ఇప్పుడు 'సత్యవాన్ సావిత్రి' అనే కోర్టు డ్రామాతో థియేటర్లలో సందడి చేస్తున్నారు. ప్రముఖ దర్శకుడు మిస్కిన్ కీలక పాత్రలో నటించడంతో ఈ సినిమాపై కొంత ఆసక్తి ఏర్పడింది. అయితే విడుదలకు ముందు పెద్దగా ప్రచారం లేకపోవడంతో ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్పందన లభించలేదు. 'సత్యవాన్ సావిత్రి' సినిమా తక్కువ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ముఖ్యంగా తెలుగు వెర్షన్‌కు సంబంధించి ప్రేక్షకుల్లో పెద్దగా అవగాహన కనిపించలేదు. సినిమా విడుదలైన విషయం కూడా చాలామందికి తెలియని పరిస్థితి నెలకొంది.మరోవైపు తమిళంలోనూ ఈ చిత్రానికి చెప్పుకోదగ్గ ఓపెనింగ్స్ రాలేదు. కీర్తి సురేశ్ వంటి గుర్తింపు ఉన్న నటి ప్రధాన పాత్రలో నటించినప్పటికీ, ఆ క్రేజ్ తొలి రోజు వసూళ్లలో కనిపించకపోవడం నిరాశ కలిగిస్తోంది.టికెట్ బుకింగ్ వేదిక బుక్‌మైషోలో ఈ సినిమా తొలి రోజు కేవలం 5 వేల టికెట్లకు కొద్దిగా ఎక్కువ మాత్రమే అమ్ముడయ్యాయి. స్టార్ నటీనటులు ఉన్న చిత్రానికి ఈ స్థాయి స్పందన రావడం బాక్సాఫీస్ వద్ద నిరాశాజనక పరిణామమే. ముఖ్యంగా తమిళ వెర్షన్ నుంచైనా మంచి ఓపెనింగ్ వస్తుందని ఆశించిన చిత్ర బృందానికి ఈ ఫలితం షాక్ ఇచ్చినట్లయింది. ప్రస్తుతం 'సత్యవాన్ సావిత్రి'కి ప్రేక్షకుల నుంచి ఆశించిన ఆదరణ కనిపించడం లేదు. అయితే వారాంతంలో సినిమా పరిస్థితి మారుతుందా? ప్రేక్షకుల స్పందనతో థియేటర్లకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. మంచి కథ, నటన ఉన్నప్పటికీ ప్రచారం లోపిస్తే సినిమాలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో ఈ చిత్రం పరిస్థితి మరోసారి గుర్తు చేస్తోంది. డ్రీమ్‌స్టిక్స్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. నూతన దర్శకుడు ప్రవీణ్ ఎస్. విజయ్ తెరకెక్కించారు. చారుకేశ్, బాల సరవణన్, శిల్పా మంజునాథ్, మధుసూదనన్, ఆర్. సుందరరాజన్, బ్రిగిడా, మాలా పార్వతి, ఏ. వెంకటేశ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సామ్ సీఎస్ సంగీతం అందించారు.



ప్రశాంత్ వర్మకు షాక్?.

వైష్ణవ్ తేజ్‌తో ప్రైమ్‌షో 'హను-మాన్ 2' అనౌన్స్‌మెంట్!



టాలీవుడ్‌లో అందరినీ షాక్‌కి గురిచేస్తూ 'హను-మాన్ 2' సినిమాపై ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ అధికారిక ప్రకటన చేసింది. మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా, విభిన్న కథలతో ఆకట్టుకునే విఐ ఆనంద్ దర్శకత్వంలో ఈ భారీ పాన్-ఇండియా సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రానికి 'హను-మాన్ 2 -- ది రైజ్ ఆఫ్ వానరాస్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. గతంలో 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఊరు పేరు భైరవకోన' వంటి ఫాంటసీ, థ్రిల్లర్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న విఐ ఆనంద్, ఈసారి సరికొత్త పౌరాణిక ఫాంటసీ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.తాజాగా విడుదల చేసిన ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో కాషాయ వస్త్రం కట్టుకున్న వైష్ణవ్ తేజ్ కండలు తిరిగిన శరీరంతో వెనుకకు తిరిగి నిలబడి ఉండగా, ఒక భారీ హనుమంతుడి తోక ఆయనను చుట్టుకుని ఆకాశంలోకి ఎత్తుతున్నట్లుగా పోస్టర్‌ను ఎంతో ఆకట్టుకునేలా రూపొందించారు. మొదటి భాగం 'హను-మాన్' సినిమాను నిర్మించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సీక్వెల్‌ను కూడా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. మరోవైపు, ఈ ప్రకటన ఇప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద చర్చకు దారితీసింది. మొదటి భాగం 'హను-మాన్'కు దర్శకత్వం వహించిన ప్రశాంత్ వర్మ, ప్రస్తుతం మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రిషబ్ శెట్టి హీరోగా 'జై హనుమాన్' సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. అయితే 'హను-మాన్' కథ, సీక్వెల్ హక్కులు తమ నిర్మాణ సంస్థకే చెందుతాయని భావిస్తున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్, ఇప్పుడు వైష్ణవ్ తేజ్ -- విఐ ఆనంద్ కాంబినేషన్‌లో నేరుగా 'హను-మాన్ 2' ప్రకటించడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుండగా, ఇందులో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర బృందం త్వరలో వెల్లడించనుంది.

ప్రేశ్నలతో విసిగించాను!

సూపర్‌స్టార్ రజనీకాంత్ 'ధర్మన్' సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్నది అందాల తార రాశీఖన్నా. ఆ సినిమా లొకేషన్‌లో రజనీతో తన అనుభవాలను ఆసక్తికరంగా వెల్లడించారామె 'నా కెరీర్‌లో చాలామంది స్టార్లతో పనిచేశాను. ఇప్పుడు 'ధర్మన్'లో సూపర్‌స్టార్‌తో పనిచేస్తున్నాను. నిజానికి స్టార్‌డమ్ ఎంజాయ్ చేస్తున్న వారి ప్రవర్తన విభిన్నంగా ఉంటుంది. కానీ కొన్ని దశాబ్దాలుగా సూపర్‌స్టార్‌డమ్‌ని ఎంజాయ్ చేస్తున్న రజనీసార్ ఆటిట్యూడ్ వారందరికీ పూర్తి భిన్నం. నిజం చెబుతున్నా..లొకేషన్‌లో రజనీసార్ నాకు ఫ్రెండ్ అయిపోయారు. సెట్‌లో ఆయన పక్కన ఉంటే చిన్నపిల్లలా మారిపోయేదాన్ని. ఆయనతో ఎంత చనువు ఏర్పడిందంటే.. ఒక్కోసారి ప్రశ్నలతో విసిగించేదాన్ని. ఆయన మాత్రం నవ్వుతూ ఓపిగ్గా సమాధానాలు చెప్పేవారు. అంత సూపర్‌స్టార్‌తో మాట్లాడాలంటే ఎవరికైనా బెరుకే. నేను మాత్రం ఆయన పక్కన కూర్చొని చాలా విషయాలు మాట్లాడేదాన్ని. ఏ మాత్రం గర్వం లేకుండా నిరాడంబరంగా ఉండే ఆయన్ను చూస్తుంటే చాలా ముచ్చటేసేది' అంటూ చెప్పుకొచ్చింది రాశీఖన్నా.

'జనవరి 12 విడుదల' నుంచి ఫస్ట్ సింగిల్ 'దివికి దివికి' విడుదల!



అగ్ర కథానాయకులు విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'జనవరి 12 విడుదల'. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లను చిత్రబృందం ఘనంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా సినిమాలోని తొలి పాట 'దివికి దివికి' సంబంధించిన సాంగ్ ప్రోమోను తాజాగా విడుదల చేసింది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తుండగా.. మధుప్రియ, హరిప్రియ కలిసి పాడారు. అనంత్ శ్రీరామ్ లిరిక్స్ అందించాడు.వెంకటేష్, కళ్యాణ్ రామ్ కలిసి నటిస్తున్న తొలి చిత్రం కావడంతో 'జనవరి 12 విడుదల'పై ఆరంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి సరసన కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com